


Truth of News
# సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 286 | శనివారం 02 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

### మూడు నెలల్లో 81 శాతం
# పెరిగిన గ్యాస్ ధర

**- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ**



- రూ.993 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర...
- తీవ్రంగా స్పందించిన రాహుల్ గాంధీ
- ఈ ధర పెంపు ఎన్నికల బిల్లు అని చురక
- రూ.993 పెరగడమంటే ఒకరోజులో నమోదైన అత్యధిక పెరుగుదల

2

# కార్మిక వర్గానికి మోడీ మేడే గిఫ్ట్

**- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య**



బెంగళూరు - సూర్య వాస్తవం

మేడే నాడు 19 కేజీల వాణిజ్య ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధర రూ. 993కి పెరిగింది. దీంతో ఈ సిలిండర్ ధర రూ. 3,071కి చేరింది. ఎన్నికల తర్వాత.. అదీ మేడే నాడే గ్యాస్ సిలిండర్ ధర కేంద్రం పెంచడాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఫైర్ అయ్యారు. కార్మిక వర్గానికి మేడేనాడు మోడీ ఇచ్చిన గిఫ్ట్ అని ఆయన అభివర్ణించారు. మోడీ ప్రభుత్వం వ్యవస్థీకృత దోపిడికి పాల్పడుతుందని సిద్ధరామయ్య తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

మేము మొదటి నుండి హెచ్చరిస్తున్నట్లే, అసె -ంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే నరేంద్ర మోడీ ప్రభుత్వం మళ్లీ ధరలను పెంచింది. ఎన్నికల సమయంలో ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి పెంపులను

- మిగతా 2లో..

# సమగ్ర కార్యాచరణతో రండి

- గుర్తింపు ఎన్నికలు, విలీనంపై చర్చించుకోండి పీఆర్సీ అంశాన్ని పరిష్కరిస్తాం
- గాజులరామారంలో 100, బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో బస్ టెర్మినల్స్
- ఒక్క డ్రైవర్‌నూ ఉద్యోగం నుంచి తొలగించం ఉద్యోగులు, యాజమాన్యం మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలి
- ఆర్టీసీ కార్మిక సంఘాలతో సీఎం రేవంత్‌రెడ్డి సమ్మె కాలంలో వేతనాల చెల్లింపు, కేసుల ఎత్తివేతకు ఆదేశం



హైదరాబాద్ - సూర్య వాస్తవం

ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందిచి ప్రయాణికులకు మెరుగైన సేవలందిం చేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్ర కార్యాచర ణ రూపొందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని తాము పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులతో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా

- మిగతా 2లో..

### వైసీపీ అధినేతకు
# మానసిక సమస్య ఉంది

- సీఎం చంద్రబాబు
- మేడే కార్యక్రమం వేదికగా వైసీపీపై సీఎం తీవ్ర విమర్శలు
- అది వైసీపీ కాదు గొడ్డలి పార్టీ అని ఎద్దేవా
- ఎన్నికల హామీ మేరకు విద్యుత్ ఛార్జీల తగ్గింపు
- పవన్, లోకేష్‌ల పనితీరుపై సీఎం ప్రశంసలు
- ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల నుంచే నివేదికలు స్వీకరిస్తామని ప్రకటన



అమరావతి- సూర్య వాస్తవం

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా కృష్ణా జిల్లా పమిడిముక్కలలో ఏర్పాటు చేసిన 'ప్రజా వేదిక' సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఉన్నది వైసీపీ కాదని, అదో గొడ్డలి పార్టీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులు రాజకీయాలకు పనికిరారని, వైసీపీ అధినేతకు మానసిక సమస్యలు ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. తాము ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను రెండు గంటల్లో కూల్చివేయడమే వారి విధ్వంసకర మనస్తత్వానికి

- మిగతా 2లో..



## 15 పోలింగ్ కేంద్రాల్లో
# రీపోలింగ్

**- ఎన్నికల సంఘం ఆదేశం**

2

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### పవనన్నా...
# ఇది మనందరి విజయం

- డిప్యూటీ సీఎం ప్రశంసలకు లోకేష్ స్పందన
- ఏపీలో నిన్న పదో తరగతి ఫలితాలు విడుదల
- గతేడాది కంటే మెరుగ్గా ఫలితాలు
- పదో తరగతి ఫలితాలపై లోకేష్ ను ప్రశంసించిన పవన్
- ధన్యవాదాలు తెలిపిన లోకేష్
- కూటమి ప్రభుత్వ సంస్కరణలతోనే మెరుగైన ఫలితాలని వెల్లడి
- విద్యాశాఖను దేశానికే ఆదర్శంగా నిలుపుతామని



అమరావతి- సూర్య వాస్తవం

పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించినందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. "పవనన్నా ఇది మనందరి విజయం" అంటూ వినమ్రంగా బదులిచ్చారు. టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ, ప్రభుత్వం సమష్టిగా కృషి చేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. పవన్ కల్యాణ్ ప్రోత్సాహం, అందరి సహకారంతో ఏపీ విద్యాశాఖను దేశానికే రోల్ మోడల్‌గా నిలుపుతానని

- మిగతా 2లో..



### నిప్పుల కొలిమిలా
# ఆంధ్ర ప్రదేశ్...

- పిడుగురాళ్లలో రికార్డు స్థాయిలో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత
- రాష్ట్రంలో ఈ వేసవిలో ఇప్పటిదాకా ఇదే అత్యధిక ఉష్ణోగ్రత
- శనివారం 64 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరిక
- ద్రోణి ప్రభావంతో కొన్ని జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్ష సూచన
- ప్రజలు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల సంస్థ సూచన

2

## మూడు నెలల్లో 81 శాతం

# పెరిగిన గ్యాస్ ధర

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కేవలం మూడు నెలల్లోనే వాణిజ్య సిలిండర్ ధరను 81 శాతం పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య సిలిండర్ ధరను ఒక్కరోజులోనే రూ.993 పెంచారని, ఇది కచ్చితంగా ఎన్నికల బిల్లు అని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయని తాను ముందే హెచ్చరించానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకు నిదర్శనమే నేడు వాణిజ్య సిలిండర్ ధర పెంపు అని తెలిపారు. రూ.993 పెరగడమంటే, ఇది ఒకరోజులో నమోదైన అతిపెద్ద పెరుగుదల అని ఆయన అన్నారు. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు ధర రూ.1,380 పెరిగిందని ఆరోపించారు. అంటే గత మూడు నెలల కాలంలో 81 శాతం పెరుగుదల నమోదైనట్లు చెప్పారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల ఈ ప్రభావం చిన్న చిన్న వ్యాపారులపై తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీ దుకాణాలు, చాయ్–టిఫిన్ డబ్బాలు, హోటళ్లు, బేకరీలు, మిఠాయి దుకాణాలు తదితర వాటిపై ప్రభావం పడుతుందని అన్నారు. తద్వారా ఇది సామాన్యులకు కూడా భారంగా మారుతుందని అన్నారు. నేటి ధరల పెంపుతో 19 కేజీల వాణిజ్య సిలిండర్ రూ.3 వేలకు పైగా ధర పలుకుతోంది.

## కార్మిక వర్గానికి

# మోడీ మేడే గిఫ్ట్

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేసింది. మే 1న వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ. 993 పెంచడంతో, ఒక్కో సిలిండర్ ధర రూ. 3,071.50కి చేరింది అని ఆయన అన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే మోడీ ప్రభుత్వం వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరలను ఆరుసార్లు పెంచింది. దీంతో ప్రజలపై భారం రూ. 1,518 మేర పెరిగింది. ఇది పరిపాలన కాదు. వ్యవస్థీకృత దోపిడి అని సిద్ధరామయ్య విమర్శించారు. ప్రపంచ పరిస్థితులు మారిన ప్రతిసారీ, మోడీ భారత పౌరులను కాపాడటానికి బదులుగా, ఆ భారాన్ని వారిపైనే మోపుతున్నారు. ఆయన ఎంత ప్రచారం పొందినా డొల్లగా ఉన్న విదేశాంగ విధానం మన ఆర్థిక వ్యవస్థను కాపాడటంలో విఫలమైంది. దానివల్ల ఇప్పుడు సామాన్య భారతీయులు దానికి మూల్యం చెల్లిస్తున్నారు అని ఆయన ఎక్స్ పోస్టులో ఆరోపించారు.

గ్యాస్ ధర పెంపు కేవలం వ్యాపారాలనే కాకుండా ప్రతి ఇంటినీ ప్రభావితం చేస్తుంది. హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న భోజనశాలలు, క్యాటరింగ్ సేవలు ధరలను పెంచవలసి వస్తుంది. దీనివల్ల రోజువారీ ఆహారం మరింత ఖరీదవుతుంది. ఒక కప్పు టీ నుండి, సాధారణ భోజనం వరకు ప్రతిదీ ఖరీదవుతుంది. పట్టణ కార్మిక వర్గం, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపార యజమానులు ఎక్కువగా నష్టపోతారు అని ఆయన అన్నారు. పెరిగిన ధరలు, తగ్గుతున్న ఆదాయాలు.. మరిన్ని కష్టాలు.. ఇదే మేడే నాడు కార్మిక వర్గానికి మోడీ ఇచ్చిన గిఫ్ట్. కార్మికులు గౌరవం, వేతనం కోసం అడుగుతుంటే.. మోడీ ప్రభుత్వం వారికి అన్నింటిపై ధరలు పెంచి ద్రవ్యోల్బణం దెబ్బకు విలవిల్లాడేలా చేస్తోంది. ఇది ఆరంభం మాత్రమే. ఇలాంటి పెరుగుదలలు మరిన్ని ఉంటాయి. భారం పౌరులపై పడుతూనే ఉంటుందని సిద్ధరామయ్య ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించి, ఆ తర్వాత వారిపై భారం మోపడం ఇదే మోడీ మోడల్ అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## వైసీపీ అధినేతకు

# మానసిక సమస్య ఉంది

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమని ఆరోపించారు. తాము రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే, ఆ పార్టీ అధికారంలోకి వచ్చి విధ్వంసం సృష్టించిందని మండిపడ్డారు. గడచిన 22 నెలలుగా తమ కూటమి ప్రభుత్వం.. గత పాలనలో ధ్వంసమైన వ్యవస్థలను పునర్నిర్మిస్తూ ఏపీకి పునర్వైభవం తెచ్చేందుకు కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తున్నామని, భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లోనూ ఛార్జీలు పెంచబోమని మరోసారి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రజలపై ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపిందని ఆయన గుర్తుచేశారు. తమ ప్రజా ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పనిచేస్తోందని, ప్రజలిచ్చే సహకారమే తమకు పెద్ద శక్తి అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాముల పనితీరును సీఎం అభినందించారు. పంచాయతీరాజ్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మార్పులు తీసుకొచ్చారని, విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేష్ సంస్కరణలు అమలు చేసి పదో తరగతిలో విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించేలా చేశారని ప్రశంసించారు. ఇక నుంచి ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల నుంచి నేరుగా సమాచారం తీసుకుంటానని కీలక ప్రకటన చేశారు. తాను టీమ్ లీడర్‌గా ఉన్నానని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని హితవు పలికారు. అంతకుముందు, ముఖ్యమంత్రి చేతుల మీదుగా అత్యుత్తమ సేవలు అందించిన కార్మికులకు, ఉత్తమ యాజమాన్యాలకు శ్రమశక్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

## 15 పోలింగ్ కేంద్రాల్లో

# రీపోలింగ్

### - ఎన్నికల సంఘం ఆదేశం

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

పశ్చిమ బెంగాల్‌లో 15 పోలింగ్ కేంద్రాల్లో శనివారం నాడు రీపోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల అధికారుల నుంచి వచ్చిన నివేదిక ప్రకారం ఈ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపింది. మగ్రాహట్ పశ్చిమ్ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాలు, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 కేంద్రాల్లో శనివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల మధ్య రీపోలింగ్ నిర్వహించనున్నట్లు ఇసి తెలిపింది. గత ఏప్రిల్ నెల 29న జరిగిన రెండో దశలో జరిగిన పోలింగ్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న కథనాల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది.

# సమగ్ర కార్యాచరణతో రండి

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై ఏవిధంగా ముందుకు పోవాలనే దానిపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వం ఎదుట ఆప్షన్లు ఉంచాలని సూచించారు.

ఒకవేళ యూనియన్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇస్తే కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి, భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దామని సీఎం తెలిపారు. ఆర్టీసీ బకాయిలు తమ హయాంలోనివి కావనీ, అయినా వాటిని చెల్లించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నా మని అన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల నిధులను వాడుకుందనే విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి అంతా కలిసిరావాలని, భావోద్వేగాలు, రాజకీయాల ప్రభావాలకు లోనైతే సంస్థకు నష్టం వాటిల్లుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, ప్రభుత్వం వేర్వేరనే భావన తమకెప్పుడూ లేదన్నారు. 2006లో జడ్పీటీసీ సభ్యునిగా గెలిచినప్పటి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్షునిగా ఉన్న సమయలో ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటాల్లో పాలుపంచుకున్నానని సీఎం గుర్తు చేశారు. సింగరేణి, విద్యుత్ కార్మికులతో పాటు ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నందునే తాము అధికారంలోకి వచ్చామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో నియా మకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచామనీ, కారుణ్య నియామకాలూ చేపట్టామని అన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయా ణికుల సంఖ్య పెరగడంతో పాటు, నెల నెలా చెల్లింపులతో ఆర్టీసీ ఆదాయం కూడా పెరిగిందని సీఎం చెప్పారు. పని భారం పెరిగినా క్షేత్ర స్థాయి సిబ్బంది సహనంతో పని చేస్తుండడంతో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సమున్నత లక్ష్యంతోనే టెర్మినళ్ల నిర్మాణం**

ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల తో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్టీసీకి గాజులరామారంలో వంద ఎకరాలు కేటాయించామని సీఎం చెప్పారు. బహదూర్‌గూడ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో)లో 150 ఎకరాలు కేటాయిస్తామని తెలిపారు. ఆర్టీసీని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్యంతోనే ఈ టెర్మినళు నిర్మించాలని నిర్ణయించా మన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. ఆర్టీసీలో డీజిల్‌కు ఏటా రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారనీ, ఆ వ్యయం తగ్గింపునకే తాము ఈవీల వైపు మొగ్గుచూపుతున్నామని అన్నారు. ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గించు కోవాలనీ, దీనికి పక్కా ప్రణాళిక అవసరమని చెప్పారు. 1000 ఈవీ బస్సులు కొనుగోలు చేసి మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేసి లాస్ట్ మైల్ కనెక్టివిటీకి కషి చేస్తామని సీఎం తెలిపారు.

అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు. సంస్థ బలోపేతానికి కార్మికులు సహకరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌నూ తొలగించ బోమని హామీనిచ్చారు. ఆర్టీసీ కార్మికులు, యాజ మాన్యం మధ్య గ్యాప్ రాకుండా చూసుకోవాలని సూచిం చారు. డిపో మేనేజర్లు, ఈడీ, ఎండీ స్థాయి అధి కారులు తరచూ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై సుహద్భావ వాతావరణంలో మాట్లా డుకుంటే సగం సమస్యలు పరిష్కారమ వుతాయని అన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులతో మూడు నెలలకోసారి సమావేశం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డికి సీఎం సూచించారు. అనేక ఇబ్బందులున్నా ఉద్యోగులు, కార్మికులు సమస్యల పరిష్కారానికి తాము పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. విశ్రాంత ఉద్యోగుల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

**కార్మికులకు అండగా ప్రభుత్వం**

ఆర్టీసీ సమస్యలను వంద శాతం పరిష్కరిస్తామనీ, కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. చిన్న చిన్న స్పర్థలతో సంస్థకు నష్టం వాటిల్లే పనులు చేయకూడదనీ, సంస్థ మనుగడ సాగిస్తేనే అందరికీ మేలు జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మూడు రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలనీ, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కార్మిక సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఏ.ఆర్.రెడ్డి, థామస్‌రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్) , అశ్వత్థామ రెడ్డి, శంకర్ (తెలంగాణ మజ్దూర్ యూనియన్ (రి)), వీరాంజనేయులు, వి.ఎస్.రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఎస్.బాబు, ఈ.వెంకన్న (ఎంప్లాయిస్ యూనియన్), పి.కమల్ రెడ్డి, ఎండీ మౌలానా (నేషనల్ మజ్దూర్ యూనియన్), ఎంకె బోస్, బి.యాదగిరి (కార్మిక పరిషత్), జి.అబ్రహం, మొగుళ్ల రాజిరెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), రాజిరెడ్డి, బి.యాదయ్య (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (రి)), బి.మునిరాములు, కె.యాదయ్య (బహుజన కార్మిక యూనియన్), కె.సత్యనారాయణ, ఎండీ అక్బర్ అలీ (ఆర్టీసీ వర్కర్స్ యూనియన్), కె.మనోహర్‌రావు, ఈ.స్వామి కుమార్ (కార్మిక సంఘ్), పున్న హరికిషన్, గోవింద్ (సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్), డి.వి.కె.రావు, కె.హనుమంతు ముదిరాజ్ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్), దువ్వాసీ యాదయ్య, సుద్దాల సురేష్ తదితరులు పాల్గొన్నారు. .

# కార్మికుల సంక్షేమం కోసం లేబర్ అడ్డాలు

**పామర్రు, పమిడిముక్కల – సూర్య వాస్తవం**

కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్రంలో లేబర్ అడ్డాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలంలో శుక్రవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అత్యుత్తమ సేవలందించిన కార్మికులకు, ఉత్తమ యాజమాన్యాలకు శ్రమశక్తి పురస్కారాలు అందజేశారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ కాలనీలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో కొద్దిసేపు మాట్లాడారు. వీరంకిలాకు గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న ఓ భవనం వద్దకు వెళ్లి భవన నిర్మాణ కార్మికులను పలకరించారు. మనమిత్ర వాట్సప్ యాప్ ద్వారా అందిస్తున్న పౌరసేవల గురించి వారికి చంద్రబాబు స్వయంగా వివరించారు. పి–4 పథకం కింద మార్గదర్శి లింగమనేని వెంకటేష్ ఇచ్చిన రూ.5 లక్షల చెక్కును 35 మంది బంగారు కుటుంబాల లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పమిడిముక్కలలో జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అత్యాధునిక పనిముట్లతో వివిధ నగరాలు, పట్టణ ప్రాంతాల్లో 15 చోట్ల లేబర్ అడ్డాలు వీటిని నిర్మిస్తామన్నారు. ఈ లేబర్ అడ్డాలను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పనిలేని రోజు ఈ కేంద్రాల్లో నైపుణ్యం పెంచుకునేలా శిక్షణ ఇస్తామని వివరించారు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలు, శ్రీసిటీతోపాటు అమరావతిలోనూ కొత్తగా ఇఎస్‌ఐ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల పిల్లలూ పరిశ్రమలు స్థాపించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నిర్మాణ రంగ కార్మికుడి వివాహ ఖర్చుకు రూ.25 వేలు ఇస్తున్నామని, కార్మికుడి కుమార్తెకు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. వారికి సంతానం కలిగితే రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు.

సాధారణ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేలు అందిస్తామని ప్రకటించారు. వివాదాల పరిష్కారానికి నాలుగు కార్మిక కోర్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 62.47 లక్షల మందికి ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్నామని, గడిచిన 22 నెలల్లో రూ.63 వేల కోట్లకుపైగా అందజేశామని వివరించారు. ప్రతి నెలా రూ.2,721 కోట్ల చొప్పున ఏడాదికి రూ.33 వేల కోట్లు మేర వ్యయం చేస్తున్నట్టు తెలిపారు. గత పాలకుల నిర్వాకం కారణంగా పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతిందని, ప్రస్తుతం వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. 2027 రాజమండ్రి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. కృష్ణా పుష్కరాల నాటికి కృష్ణా జిల్లాకు నీటి ఎద్దడి లేకుండా చేస్తామన్నారు. బందరు పోర్టుకు బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్, ఆఫ్ షోర్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్‌కు బందరు పోర్టు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. హైదరాబాద్–మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోందన్నారు.

భారత్ మాల పరియోజన కింద కేంద్రం రూ.574 కోట్లతో రోడ్లను విస్తరిస్తోందని తెలిపారు. మచిలీపట్నం బైపాస్ రోడ్డు రెండు లేన్ల నుంచి ఆరు లేన్లుగా నిర్మించడంతోపాటు బీచ్ రోడ్డును కూడా విస్తరిస్తున్నామన్నారు. విశాఖకు గూగుల్ అతిపెద్ద పెట్టుబడితో వచ్చిందని, త్వరలో రిలయన్స్ కూడా 17 బిలియన్ డాలర్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు రాబోతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపి బాలశౌరి, రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శి ఎంవి.శేషగిరి బాబు పాల్గొన్నారు.

## నిప్పుల కొలిమిలా

# ఆంధ్ర ప్రదేశ్...

**అమరావతి– సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో శుక్రవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. ఇక్కడ ఏకంగా 45.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో ఈ వేసవి సీజన్‌లో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇదేనని అధికారులు స్పష్టం చేశారు. ఇవాళ రాష్ట్రంలోని 21 జిల్లాల పరిధిలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 252 మండలాల్లో 41 డిగ్రీలకు పైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు, రానున్న రెండు రోజులు రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 64 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా పల్నాడులో 19, పార్వతీపురం మన్యంలో 10, ప్రకాశంలో 10 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లోని 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ఇదిలా ఉండగా, ద్రోణి ప్రభావంతో ఉత్తరాంధ్ర, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆది, సోమవారాల్లో కొన్ని జిల్లాల్లో ఎండ తీవ్రత స్వల్పంగా తగ్గి, ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల సంస్థ సూచించింది.


## పవనన్నా...

# ఇది మనందరి విజయం

(మొదటి పేజీ తరువాయి)

లోకేష్ స్పష్టం చేశారు. అంతకుముందు, పదో తరగతి ఫలితాలపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. విద్యాశాఖలో మంత్రిగా నారా లోకేష్ అమలు చేస్తున్న ప్రణాళికలు ప్రశంసనీయమని, కూటమి ప్రభుత్వ సంస్కరణలతోనే అద్భుత ఫలితాలు వచ్చాయని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం సుమారు 4 శాతం పెరిగిందని పవన్ గుర్తుచేశారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత 72.8 శాతం నుంచి 78.39 శాతానికి పెరగడం శుభపరిణామమన్నారు. మెగా పేరెంట్ టీచర్స్ మీట్, పరీక్షలకు ముందు అమలు చేసిన 100 రోజుల ప్రణాళిక వంటివి సత్ఫలితాలనిచ్చాయని ఆయన వివరించారు. ఈ విజయం వెనుక ఉన్న ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులకు పవన్ అభినందనలు తెలియజేశారు.

## సంపాదకీయం




# పెట్రోలియం ఉత్పత్తులపై రేషనింగ్

నెల క్రితం అంతర్జాతీయంగా తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత ఇంధన భద్రతపై నీలి నీడలు కమ్ముకున్నాయి. యుద్ధం ప్రారంభమైన సమయంలో భారత్ వద్ద సుమారు 66 రోజుల వినియోగానికి సరిపడ చమురు నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, గత నెల రోజులుగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతినడం, ప్రధాన సముద్ర మార్గాల్లో రవాణాకు ఆటంకాలు కలగడం వల్ల దిగుమతుల్లో కొంత జాప్యం చోటుచేసుకుంది. ఫలితంగా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి.భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85 శాతం దిగుమతుల పైనే ఆధారపడుతోంది. యుద్ధానికి ముందు రోజుకు సగటున 4.5 నుంచి 5 మిలియన్ బారెళ్ల ముడి చమురును మనం దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ, ప్రస్తుత సరఫరా ఆటంకాల వల్ల ఈ దిగుమతుల్లో 10 నుంచి 15 శాతం వరకు లోటు కనిపిస్తోంది. రష్యా నుంచి వచ్చే చమురు రవాణా మార్గాల్లో బీమా ,షిప్పింగ్ సమస్యలు తలెత్తడం, గల్ఫ్ దేశాల నుంచి వచ్చే సరఫరాలో జాప్యం జరగడం వల్ల రిఫైనరీలకు అందే ముడి చమురు పరిమాణం తగ్గింది. ఈ లోటును పూడ్చేందుకు ప్రభుత్వం గయానా , బ్రెజిల్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, రవాణా ఖర్చులు పెరగడం సవాలుగా మారింది.దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత వస్తుందని ఈ కారణంగానే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రస్తుతం ఎటువంటి తక్షణ కొరత లేదని, ప్రజలు భయాందోళనతో కొనుగోళ్లు చేయవద్దని విజ్ఞప్తి చేస్తోంది. అయితే, రిటైల్ మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయడంలో కొన్ని చమురు కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు క్షేత్రస్థాయి నివేదికలు చెబుతున్నాయి. చమురు ధరలు బారెల్ కు 100 డాలర్ల మార్కును దాటి స్థిరంగా కొనసాగితే, భారత్ వంటి దిగుమతి దేశాలపై ద్రవ్యోల్బణ భారం విపరీతంగా పెరుగుతుంది. పశ్చిమాసియాలో పరిస్థితులు మారకపోతే ఇంధన రేషనింగ్ వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి రావచ్చు. రాబోయే రెండు వారాల్లో దిగుమతులు మళ్ళీ గాడిలో పడతాయని, కేంద్రం రష్యా , ఇతర దేశాలతో జరుపుతున్న చర్చలు సఫలమైతే పెట్రోల్, డీజిల్ కొరత సమస్య తలెత్తదని కేంద్రం నమ్మకంతో ఉంది. కేంద్ర ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం.. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినట్లుగా వస్తున్న ఊహాగానాల్ని కొట్టిపారేసింది. మినిస్ట్రీ ఆఫ్ పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ విభాగం నుంచి ధరల పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రకటనా రాలేదని.. నకిలీ ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేసింది.

ఈ మేరకు ఫేక్ సోషల్ మీడియా పోస్టుల్ని కోట్ చేస్తూ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఈ ఆర్డర్ నకిలీది. భారత ప్రభుత్వం ఇలాంటి ఉత్తర్వుల్ని అసలు జారీ చేయలేదు.' అని అందులో పేర్కొంది. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ లీడర్లు ఈ నకిలీ పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది.దేశంలో పెట్రోల్ ధర రూ. 10, డీజిల్ ధర రూ. 12.50 పెరిగినట్లు.. భారత పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నుంచి సర్క్యులర్ వచ్చినట్లుగా ఉన్న ప్రెస్ నోట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. దీనినే నకిలీది అని కేంద్రం స్పష్టం చేసింది. ఇలాంటి నకిలీ వార్తల్ని, ప్రకటనల్ని నమ్మొద్దని.. ఇలాంటి వార్తల్ని ధ్రువీకరించుకునేందుకు ఎల్లప్పుడూ అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఛానెళ్లను చూడాలని స్పష్టం చేసింది. దేశంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగానే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 94.77 గా ఉండగా.. డీజిల్ రూ. 87.67 పలుకుతోంది. ముంబైలో పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా రూ. 103.54, రూ. 90.03 వద్ద ఉన్నాయి. ఇక హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 107.46 వద్ద ఉండగా.. డీజిల్ ధర రూ. 95.70 వద్ద ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో చూస్తే.. హైదరాబాద్‌లోనే ధరలు ఎక్కువగా ఉన్నాయి.దేశంలో ఇటీవల 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 29నే బెంగాల్‌లో చివరి దశ పోలింగ్‌తో.. ఎన్నికలు ముగిశాయి. ఈ క్రమంలో.. కొద్ది రోజుల ముందు నుంచే దేశంలో.. ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరల్ని కేంద్రం పెంచుతుందని వార్తలు వచ్చాయి. అయితే అలాంటిదేం ఉండదని.. పెట్రోలియం మంత్రిత్వ శాఖ, కేంద్రం కూడా బదులిస్తూ వచ్చాయి.

అమెరికా- ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చమురు రవాణాకు కీలకంగా ఉన్న హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. మరోవైపు ఇరాన్ ఓడరేవుల్ని అమెరికా దిగ్బంధించింది. అక్కడ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. భారత్‌లోనూ నిల్వలు తక్కువగా ఉన్నాయి. క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఒకవైపు.. కొన్ని పెట్రోల్ బంకులు రద్దీగా కనిపిస్తుంటే.. కొన్ని నో స్టాక్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. దీంతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇదే సమయంలో ధరల్ని పెంచుతుందని ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం క్రూడాయిల్ ధర ఏప్రిల్ 30న.. 125 డాలర్ల మార్కును చేరి.. నాలుగేళ్ల గరిష్ఠానికి చేరింది.అటు సరఫరాను పునరుద్ధరించడం, ఇటు ధరలను అదుపులో ఉంచడం ప్రభుత్వానికి కత్తి మీద సాములా మారింది. ప్రస్తుతానికి భయపడాల్సిన పని లేకపోయినా, అంతర్జాతీయ పరిణామాలను బట్టి రాబోయే రోజుల్లో ఇంధన పొదుపు మంత్రం పాటించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

# అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**- సీఐ యస్ కె చాంద్ భాషా**



**చెన్నూరు - సూర్య వాస్తవం**
బహిరంగ ప్రదేశాలలో మద్యం, గంజాయి, డ్రగ్స్ సేవించి ఆకతాయి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ చాంద్ భాష పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన చెన్నూరు కొత్త గాంధీ నగర్ ఆర్ సి ఎం చర్చి వద్ద యువతకు కౌన్సిలింగ్ నిర్వహించారు. యువత తమ గ్రామానికి ఆదర్శంగా ఉండాలే తప్ప, మద్యానికి గంజాయికి డ్రగ్స్ కు అలవాటు పడకూడదు అన్నారు. వాటికి బానిసలు అయితే మీ జీతాలు నాశనం అవ్వడమే కాకుండా, తమ కుటుంబాలు కూడా వీధిన పడతాయని యువత చెడుమార్గాలను అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దని అక్కడ యువతకు ఆయన సూచించారు. ఆర్.సి.యం చర్చి నందు విశాలవంతమైన స్థలం ఉంది కాబట్టి యువకులు ఇక్కడ క్రీడలు ఆడుకోవడానికి చాలా అనువుగా ఉందని క్రీడలు తప్ప గొడవలు సమస్యలకు వెళ్లరాదని అక్కడికి చెప్పడం జరిగింది. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు చర్చి ప్రాంగణంలోనికి వస్తే అలాంటి వారిపై నిఘా పెట్టి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలియజేశారు. అయితే గురువారం సాయంత్రం కొందరు యువకులు చర్చి ఆవరణంలో మద్యం గంజాయి సేవిస్తున్నారు అన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్ళగా అక్కడ కొంతమంది మద్యం సేవించిన యువకులు పోలీసుల పైకి వెళ్లి వారిని దుర్భాషలాడి వారిపైకి దాడులకు తెగబడగా పోలీసులు ఏమి చేయలేక పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి మరికొంతమంది పోలీసులను రావలసిందిగా కోరగా పోలీసులు అక్కడికి వెళ్లేసరికి అక్కడి ఆకతాయి యువత పారిపోవడం జరిగింది. అయితే అక్కడే ఉన్న కొంతమంది స్థానిక యువకులు ఎవరు కూడా వాళు చేస్తున్నది తప్పు అని చెప్పకపోవడం బాధాకరమని పోలీసులు అంటున్నప్పటికీ, ఏదైనా చెబితే వారు మాపై గొడవకు వస్తారని పోలీసులపైకే వారు దాడికి పాల్పడితే, సామాన్యులమైన మా పైకి వస్తే మా పరిస్థితి ఏంటని వారు బాధపడడం గమనార్హం, కాగా చర్చి ఆవరణలో పట్ట పగలు గంజాయి, మద్యం సేవిస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, పైగా పోలీసులపైకే దాడికి తెగపడడంతో ఇదంతా గమనించిన స్థానిక ప్రజలు బహిరంగ ఫిర్యాదు చేసేందుకు భయపడుతున్నారు. ఇంత జరుగుతున్న ఇప్పటికైనా పోలీసులు ఇలాంటి దాడులకు తెగపడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.








# అనాధ శవాలకు ఆత్మబంధువు ఐఎంఎం మహబూబ్ బాషా

**అనంతపురం - సూర్య వాస్తవం :** అనాథ శవాలకు ఆత్మబంధువులుగా మారి ఐఎంఎం మహబూబ్ బాషా మానవత్వంతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.శుక్రవారం నాడు నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు స్థానిక ఇంటర్ కాలేజీ వద్ద యాక్సిడెంట్ కు గురై చికిత్స పొందుతూ చనిపోయిన గుర్తుతెలియని శవానికి తన కుమారుడు అబ్దుల్ రజాక్, పొన్నూరు భాష తో కలిసి నారాయణస్వామి వెంకటేష్ పవన్ శ్రీనివాసులు ఆర్థిక సాయం తో హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్రక్రియలు నిర్వహించారు.సమాజంలో మానవత్వం చావలేదని నిరూపిస్తూ, ఎవరూ లేనివారికి అండగా నిలుస్తున్న ఐ ఎం ఎం మహబూబ్ భాషకు జిల్లా వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు

**- 385 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి, న్యాయశాఖలో 21 కొత్త కొలువులు**




**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ మాట్లా డుతూ శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాబినెట్లో 41 అంశాల పైన ఈ సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసు కోవడం జరిగింది. అవి శాఖల వారీగా తీసుకుంటే హోం శాఖకు సంబంధించిన 23 సంవత్సరాలుగా ఎటువంటి పదోన్నతి లేకుండా ఉన్న దాదాపు 385 మంది కానిస్టేబులను హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగింది ఇది సిరీస్ అఫ్ గవర్నమెంట్ లో కొద్దిగా నెగ్లేట్ అయిన ట్లుగా కనబడింది అందుకని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాఖల రివ్యూలో చెప్పినప్పుడు దానిని ఆమోదించడం జరిగింది. అలాగే న్యాయశాఖకు సంబంధించి రెండు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొన్ని పోస్టులు సృష్టించమని సుప్రీంకోర్టు ఆదేశించింది. వారి ఆదేశాల మేరకు దాదాపు రాష్ట్రంలోని న్యాయవిభాగాల్లో 21 పోస్టు సృష్టించడం జరిగింది అవి చీఫ్ కోర్టు మేనేజర్, ఐదు సీనియర్ కోర్టు మేనేజర్లు, 15 కోర్టు మేనేజర్లు, కొత్తగా పోస్టులు క్రియేట్ చేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం జరిగింది దానితోపాటు ఢిల్లీలోని ఏపీ భవన్లో అడ్వకేట్ ఆన్ రికార్డ్ కార్యాలయంలో మేనేజర్ పోస్ట్ ఒకటి కొత్తగా క్రియేట్ చేయడం జరిగింది. మేడే సందర్భంగా కార్మిక సోదరులందరికీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శు భాకాంక్షలు తెలియజేశారు.

# గుమ్మం తట్టిన పింఛన్

- పింఛన్ కోసం క్యూలకు చెక్!
- వృద్ధులు, దివ్యాంగులకు, లబ్ధిదారులకు భారీ ఊరట!
- లబ్ధిదారుల వద్దకే సేవలు
- ప్రభుత్వం సంకల్పం



**నాయుడుపేట – సూర్య వాస్తవం:** పట్టణంలోని అర్హులైన లబ్ధిదారులకు సౌకర్యవంతంగా పింఛన్లను అందించాలనే ఉద్దేశంతో తిరుపతి జిల్లా నాయుడుపేటలో ఇంటింటికీ పింఛన్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించబడింది. సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా పింఛన్లు అందజేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ కార్యక్రమం వృద్ధులు, అవ్వాతాతలు, దివ్యాంగులు వంటి వర్గాలకు మరింత సౌలభ్యం కల్పించడమే లక్ష్యంగా అమలవుతోందని వారు తెలిపారు. పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారి గుమ్మం వద్దకే సేవలను అందించడం ద్వారా ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి కష్టాలు పడకుండా వారికి అవసరమైన సేవలను ఇంటి వద్దకే అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పింఛన్ అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తమకు ఎంతో ఉపశమనం కలిగించిందని తెలిపారు. ఇంటికే వచ్చి పింఛన్ అందించడం వల్ల ప్రయాణ ఖర్చులు, శారీరక ఇబ్బందులు తప్పుతున్నాయని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తున్నాయని వారు పేర్కొన్నారు.



## మోడల్ స్కూల్ టాపర్ హర్షిత



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలోని టెన్త్ క్లాస్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. గుత్తి మండలంలోని మోడల్ స్కూల్లో హ ర్షిత అత్యధికంగా 600కు 584 మా ర్కులు సాధించి స్కూల్ టాపర య్యింది. విద్యార్థిని ప్రిన్సిపల్ ప్రతిష్ట కుమారి, ఉపాధ్యాయులు, తల్లింద్రులు బంధుమిత్రులు అభినందించారు.

## మహర్షి దయానంద గురుకులం టాపర్‌గా రైతుబిడ్డ వై.ప్రవీణ్ కుమార్ రెడ్డి





**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి టెన్త్ క్లాస్ పరీక్ష ఫలితాలలో గుత్తి మహర్షి దయానంద గురుకు లం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. కాసేపల్లి గ్రామానికి చెందిన రైతు దంపతులు వై వెంకటరా మిరెడ్డి వై కళావతి కుమారుడు వై.ప్రవీణ్ కుమార్ రెడ్డి 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించి పాఠశాలకు ప్రథమ స్థానం కైవసం చేసుకొన్నాడు. పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. మొత్తం 58 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా, అందరూ ఉత్తీర్ణత సాధించడంతో పాఠశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు బంధుమిత్రులు సంబరాలు చేసుకుంటున్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ





**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఎన్టీఆర్ పెన్షన్ భరోసా కార్యక్రమం లో భాగంగా 25వ వార్డు తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి నూరి, జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా సమక్షంలో శుక్రవారం తెల్లవారక ముందే పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా నూరి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎంతో ఉపయుక్తంగా ఉందని తెలిపారు. ఒకటవ తేదీన తెల్లవారకముందే పెన్షన్ డబ్బు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇందులో భాగంగా తమ వార్డు పరిధిలోని హైదర్ ఖాన్ వీధి, డీఎస్పీ ఆఫీస్ లైన్, మట్టి మసీద్ వీధులలో పెన్షన్ లబ్దిదారులకు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేపట్టినట్టు తెలిపారు.

## ఆయుర్వేద మజ్జిగ పంపిణీ



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం :** వేసవి మండుటెండలో విధి నిర్వహణ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ బస్ డ్రైవర్లు, కండక్టర్ లకే కాకుండా ప్రయాణీకులకు, ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు, పాదచారులకు, వలస కార్మికులకు కార్మిక దినోత్సవ సందర్భంగా ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో మణికొండ పంచవటి కాలనీ కూడలి వద్ద "" ఆయుర్వేద మజ్జిగ "" ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా సేవా సమితి గౌరవ సలహాదారు తిప్పరాజు రమేష్ బాబు, సీనియర్ జర్నలిస్ట్ విజయ్ కుమార్ రెడ్డి, రాజేష్ రెడ్డి, సుభాష్, శివ, రాజు, ఈశ్వర్, భారత రాష్ట్ర సమితి నాయకులు సీతారాం ధూళిపాల, శ్రీధర్, సంఘ సేవకులు పద్మనాభ స్వామి, శంకర్ రావు, తానాషా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యకుడు రాజశేఖర్, సభ్యుడు సుగుణ రాజు, సంఘ సేవకుడు పెంటా రెడ్డి, ఎం ఆర్ పి ఎస్ నాయకుడు కుమ్మరి సత్యనారాయణ, మణికొండ బీజేపీ నాయకులు కంకణాల శివరాం రెడ్డి, విజయకుమార్, సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్ సభ్యులు రేణికుంట భాస్కర్, విష్ణు, సుధా రామకృష్ణ, రవి,లక్ష్మణ్, నవ సేవా సంకల్ప ట్రస్ట్ చైర్మన్ మణి, సభ్యులు మహేష్, అజార్, హర్షా రెడ్డి తదితరులు పాల్గొని దాదాపు ఆరు వేలమందికి చల్లటి ఆయుర్వేద మజ్జిగ పంపిణీలో భాగస్వాములు అయ్యారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించడానికి, భాగస్వాములైన వారికి ప్రజా సేవా సమితి తరఫున రాజేష్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, రాజు, తిప్పరాజు రమేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

## పదిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు

**- వైజిఆర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి**



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం:** పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నంద్యాలంపల్లికు చెందిన వై జి ఆర్ ట్రస్ట్ చైర్మన్ ఎర్ర నాగు శ్రీధర్ రెడ్డి అభినందనలు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మంచి మార్కులు సాధించారన్నారు. త్వరలోనే ప్రతి పాఠశాలలోని ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేస్తామన్నారు. ఈ విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.



## దుర్గమ్మ దేవాలయానికి రూ.లక్ష విరాళం

**- అందజేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు ఈశ్వర్**



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మున్సిపాలిటీ పరిధిలో ని చెట్నేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గ మ్మ దేవాలయంకి గుంతకల్లు శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు గుత్తి, పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ గుత్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయం దగ్గర లక్ష రూపాయలు విరాళం ఇచ్చిన మన ఎంఎల్ఎకి, అయన కుటుంబ సభ్యులకు దుర్గమ్మ తల్లి అష్ట ఐశ్వర్యలు, ఆయురారోగ్యాలు కల్పించి, ఆ తల్లి దీవెనలతో సుఖంగా ఉండాలని మేమంతా కోరుకుంటున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ, మండల కూటమినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు ఈశ్వర్



**పామిడి –సూర్య వాస్తవం :** పామిడి పట్టణం మూడవ వార్డు వెంగమ నాయుడు కాలనీ మరియు చైతన్య కాలనీల నందు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వార్డు ప్రజలు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆయన తనయుడు పామిడి మండలాల ఇన్చార్జి గుమ్మనూరు ఈశ్వర్‌ని సంప్రదించి వార్డు పరిస్థితి వివరించగా స్పందించిన ఎమ్మెల్యే మరియు గుమ్మనూరు ఈశ్వర్ తక్షణమే 25 లక్షల రూపాయలతో నూతన సిసి డ్రైనేజీ లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంగమ నాయుడు కాలనీలో 25లక్షల తో నిర్మించిన నూతన సిసి రోడ్డు డ్రైనేజీలు గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ఆయన తనయుడు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులో ఇంకా ఏమైనా సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని కచ్చితంగా పరిష్కరిస్తామని గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుపుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, మూడో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రపంచ కార్మికులారా ఏకంకండి

**- రాష్ట్ర మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ రామోజీ ఇమ్మానుయేల్**



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం :** వై.ఎస్.ఆర్.కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో మేడే పురస్కరించుకుని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం దగ్గర ఉన్న పోస్ట్ ఆఫీస్ ఎదురుగా జెండా ఆవిష్కరణ గావించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాల మహానాడు జాతీర అధ్యక్షుడు రామోజీ ఇమ్మానుయేల్ పాల్గొని ఆయన చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానియేలు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షులు ఎన్.బి సాగర్ మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని రద్దుచేసి 12 గంటల పని దినాన్ని అమలు చేయడం కోసం లేబర్ కోర్సును తీసుకురావడం దారుణమని విమర్శించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి దప్పెల్ల దేవదాసు కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఉల్లి కిరణ్ రాష్ట్ర మాలమహానాడు యువజన కార్యదర్శి మేరేంద్ర బాబు పాల్గొన్నారు.

## కల్పతరు పోలీస్ వెల్ఫేర్ స్టోర్స్‌కు సరుకుల సరఫరాకు సీల్డ్ టెండర్ల ఆహ్వానం


**- ఈ నెల 2 నుండి 6 లోగా దాఖలు చేయాలి**

**- జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ వెల్లడి**

**కడప – సూర్య వాస్తవం :** జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు సంక్షేమంలో భాగంగా నిర్వహిస్తున్న నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద ఉన్న కల్పతరు పోలీస్ వెల్ఫేర్ స్టోర్స్‌కు ప్యాక్ చేసిన కిరాణా వస్తువులు, కాస్మెటిక్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, హోం అప్లయన్సెస్ సరఫరాకు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 మే నెల నుండి 2027 మార్చి నెల వరకు క్రెడిట్ బేసిస్ లో కిరాణా వస్తువులు, కాస్మెటిక్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, హోం అప్లయన్సెస్, హోమ్ నీడ్స్, క్లీనింగ్ మెటీరియల్స్, వాషింగ్ పౌడర్, వాషింగ్ సోపులు, నంద్యాల సోనా మసూరి పాత బియ్యం, బ్రాండెడ్ బియ్యం ప్రతి బ్యాగు 26 కె.జిలు సరఫరాకు అవగాహన ఒప్పందం కొరకు ఆసక్తి కలిగిన ఏజెన్సీ నిర్వాహకులు, డీలర్స్ ఇందులో పాల్గొనవచ్చని తెలిపారు. మే నెల 2 వ తేది ఉదయం 10 గంటల నుండి మే నెల 06 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్ లో తమ సీల్డ్ టెండర్లను దాఖలు చేయవచ్చని, 6 వ తేది సాయంత్రం 5:30 గంటలకు టెండర్లను పోలీస్ అధికారుల సమక్షంలో పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హలులో తెరవడం జరుగుతుందని జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ పేర్కొన్నారు.

## పుట్లూరులో వడగండ్ల వాన

**- ఆందోళనలో రైతాంగం**



**పుట్లూరు – సూర్య వాస్తవం :** పుట్లూరు మండల కేంద్రంలో గురువారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. అకస్మాత్తుగా కురిసిన ఈ వర్షానికి పంటలు దెబ్బతినే అవకాశం ఉండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అకాల వర్షం వల్ల వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

# ప్రపంచ కార్మికులారా ఏకంకండి...

- కార్మిక చట్టాల పరిరక్షణకై ఉద్యమాలు చేపడుదాం : బి.గిడ్డయ్య
- మే డే ర్యాలీని ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పి.రామచంద్రయ్య





**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** ప్రపంచ కార్మికులారా ఏకంకండి, కార్మిక చట్టాల పరిరక్షణకై ఉద్యమాలు చేపడు దా మని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 140 వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తేరుబజార్ నుండి నాలుగు స్తంభాల మండపం వరకు కార్మికలతో ర్యాలీ చేపట్టి ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు నెట్టికంటయ్య అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ సర్కిల్ కూడలిలో ఏఐటీయూసీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య ఆవిష్కరించగా, కూరగాయల మార్కెట్ దగ్గర,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్. కృష్ణయ్య పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి. గిడ్డయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా కుదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ఉదృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఎం.రంగన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, పత్తికొండ, తుగ్గలి మండల కార్యదర్శులు యు.కారుమంచి, సుల్తాన్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, తిమ్మయ్య, పెద్ద ఈరన్న, ఏఐటీయూసీ నాయకులు గుండు భాష, మాదన్న, రాజప్ప, సిద్ధ లింగప్ప, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు కాంతమ్మ, సుంకమ్మ, వివిధ రంగాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# రిలే నిరాహార దీక్షలు జయప్రదం చేయండి

## - ఫ్యాప్టో



**కదిరి - సూర్య వాస్తవం :** ఈనెల 25, 26 ,27 తేదీన విజయవాడలో జరుగు రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ నందు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని ఫాప్టో ఈరోజు ఒక ప్రకటనలో రిలే నిరాహార దీక్షల జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు సంవత్సరాలు కావస్తున్న సమస్యల పరిష్కారం వైపు ఆలోచన చేయకపోవడం అన్యాయమన్నారు. 11 వ పిఆర్సి గడువు ముగిసి మూడు సంవత్సరాలు కావస్తున్న 12 వ పిఆర్సి కమిషన్ కూడా నియమించక పోవడం ఏమిటి అని ప్రశ్నించారు. పిఆర్సి ఆలస్యం వలన ప్రతి ఉద్యోగికి నెల నెల వేళల్లో నష్టం వాటిల్లుతుందని వెంటనే 12వ పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేసి 30% మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ద్రవ్యోల్బణం కారణంగా ధరలు మూడింతలు పెరిగాయని, కానీ కాలానుగుణంగా రావాల్సిన డి ఏ లు కాలయాపన చేస్తూ నాలుగు డిఏ లను పెండింగ్లో పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్లో ఉన్న డి ఎ లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక బకాయిలు 30 వేల కోట్లు పేరుకు పోయాయని వాటి చెల్లింపులకు రోడ్ మ్యాప్ ప్రకటించి విడతల వారీగా ఉద్యోగి ఖాతాల్లోకి డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. సి పి ఎస్-జి పి ఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. మెమో 57 అమలు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను పాత పెన్షన్ కి ఎందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించాలి. 72, 71, 74 జీవోలు అమలు చేయాలని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ఖ్రాఖీ సమస్య పరిష్కరించి అర్బన్ ఎంఈఓ పోస్టులను కేటాయించాలని డిమాండ్ చేశారు. పాఠశాల స్థాయిలో బోధనేతర పనులను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని తెలిపారు. మెడికల్ బిల్లులు, ఫీజు రియింబర్స్మెంట్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, ప్రతి ఉన్నత పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని ,కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాలు, ఎయిడెడ్ యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం!

## - ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే కందికుంట



**కదిరి - సూర్య వాస్తవం:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సత్య సాయి జిల్లా కదిరి మున్సిపల్ 23వ వార్డులో శుక్రవారం 'ప్రజా దర్బార్' నిర్వహించారు. పింఛన్లను పంపిణీ చేసిన తర్వాత ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలను కలిసి, వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నాను. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజలకు న్యాయం చేస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎక్కడ సమస్యలతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు తాను కూడా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం ప్రజలు సమర్పించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి మెజారిటీ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, కొత్త పింఛన్లు వంటి సమస్యలపై అధికంగా అర్జీలు వచ్చాయి. దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల చెంతకే పాలనను తీసుకువెళ్లడమే లక్ష్యంగా, ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం చూపేవరకు తన కృషి కొనసాగుతుందన్నారు.

# దివానే సాహెబ్ ఉరుసులో 2000 మందికి చికెన్ బిర్యానీ ఏర్పాట్లు



**రాయచోటి - సూర్య వాస్తవం:** నియోజకవర్గ కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బండ్లపెంటలో వెలిసిన దివానే సాహెబ్ దర్గా 68వ ఉరుసు మహోత్సవంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన గంధం రోజు పాల్గొన్న భక్తుల కోసం విందు సుమారు 2000 మందికి చికెన్ బిర్యాని ఏర్పాట్లు చేసినట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులతో పాటు ఎ.ఇర్షాద్ ఖాన్, బర్కతుల్లా, అప్సర్, ఇషాక్, అఫన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఐ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

## - ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్ రావు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లెలోని శ్రీ కందుల ఓబుల్ రెడ్డి చారిటబుల్ ఐటీఐలో 2026-27విద్యా సంవత్సరం లో అడ్మిషన్స్ పొందడానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పీవీయస్ వి.ప్రసాదరావు ఒక ప్రకటన లో కోరారు. ఐ టి ఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాట్సమెన్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్స్ కలవని తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులతో పాటు ఫెయిల్ అయిన వారికీ అవకాశం కలదని తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాట్సమెన్, సివిల్ కోర్సులు రెండు సంవత్సరాల కోర్సులు అని డీజిల్ మెకానిక్ ఒక సంవత్సరం కోర్స్ అని వీటికి పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు అర్హులు అని వెల్డర్ కోర్స్ కు 10ఫెయిల్ అయిన 8వ తరగతి పాస్ అయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు ఫీజు వుంటాయని ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు ఐటీఐలో సంప్రతించాలని తెలియజేశారు.

# నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

## - జిల్లా కలెక్టర్కి ఎంపీ అవినాష్ రెడ్డి వినతి



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గంలో అకాల వర్షం, ఈదురు గాలుల ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలనిజిల్లా కలెక్టర్ కి పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి కోరారు. గురువారం రాత్రి పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలకు మరియు ఈదురు గాలులకు అరటి, మామిడి పంటలు భారీగా దెబ్బతిని రైతాంగం తీవ్ర నష్టాన్ని చవిచూస్తోందని ఈ తీవ్ర నష్టంపై పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీధర్ కి తెలిపి, నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం తరుపున నష్టపరిహారం అందించాలని, వెనువెంటనే హార్టికల్చర్, రెవిన్యూ అధికారులకు పంట నష్టం తీవ్రతను క్షేత్రస్థాయి లో పరిశీలించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందచేయాలని కోరడం జరిగింది. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులకు పంట నష్టం అంచనాలు సేకరించమని ఆదేశాలు జారీ చేశామని ఎంపీకి తెలియజేశారు.

# మండల ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్

## - శుభాకాంక్షలు తెలియజేసిన టిడిపి కాయల రమణ యాదవ్



**శింగనమల - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా శింగనమల మండలంలో కొత్తగా ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్ని టిడిపి నాయకులు కాయల రమణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కాయల రమణ యాదవ్ సూచించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ భాస్కర్ ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ అధ్యక్షులు ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# దివానే సాహెబ్ ఉరుసు మహోత్సవంలో పాల్గొన్న మంత్రి మండిపల్లి



**రాయచోటి - సూర్య వాస్తవం:** రాయచోటి పట్టణంలోని బండ్లపెంటలో వెలిసిన దివానే సాహెబ్ దర్గా 68వ ఉరుసు మహోత్సవంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, ప్రజలు క్షేమంగా ఉండాలని ఆయన ప్రార్థించారు.అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అన్ని మతాల మధ్య సౌహార్ద్రం, ఐక్యత పెంపొందించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా మొలకల పౌర్ణమి వేడుకలు



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం :** సింహాద్రిపురం గ్రంథాలయ సమీపాన కొలువైయున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద శుక్రవారం మొలకల పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ గత 12 రోజుల క్రితం 12 ధాన్యాల పేరిట మహిళలు యువతులు ధాన్యాన్ని సేకరించారు. వీటిలో ఏ పంట పుస్తిగా ఏపుగా వస్తుందో ఆపంటను ఖరీఫులో సాగు చేయడం అనవాతిగా వస్తుంది ఇలా 12 రోజులపాటు ప్రత్యేకపూజలు జరపడం భూమాత గౌరమ్మ లను కీర్తిస్తూ పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా శుభ సాయంకాలం మొలకలకుంపట్లును డప్పు వాయిద్యాల నడుమ మహిళలు, యువతులు, ప్రదర్శనంతో వెళ్ళి ఆలయాల వద్ద విశేష పూజలు నిర్వహించి కుంపట్లు ఉంచారు. వాటిలో భాగంగా భక్తుల సహాయ సహకారాలతో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సింహాద్రిపురం మండల పరిధిలోని గురజాలలో రెండు ప్రాంతాల లోవేర్వేరుగా మొలకల పౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం





**వేంపల్లె – సూర్య వాస్తవం :** కడప జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన కుంటుమల్ల పాండురంగ,టిడిపి నేత దేవర్ల చంద్రశేఖర్రెడ్డి.వేశీపల్లె కుంటుమల్ల పాండురంగ, దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాశీగే), అధ్వరాయంలో వేశీపల్లెలోని తల్లి శెట్టి సుబ్రహ్మణ్యం జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ నందు కడప జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంనీ కుంటుమల్ల పాండురంగ, దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి, పాల్ దినేష్ ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ కు జిల్లా స్థాయి నుండి 36 టీములు వచ్చాయని ప్రతిరోజు రెండు టీములకు మ్యాచ్ జరుగుతుందని గెలిచిన వారికి మొదటి బహుమతి 100000, రెండవ బహుమతి 50000 అందజేసినట్లు తెలిపారు. అలాగే యువత అంత క్రిడా రశీగంలో జిల్లా స్థాయి కాకుండ రాష్ట్ర స్థాయిలో క్రిడాను ముందుకు సాగాలని చెప్పారు. ఈ కార్యక్రమాంలో శబరి, చిన్న త్థాజ్, విష్ణు, బాబా, మధర్స వల్లి, గంగాధర్ రెడ్డి, అల్తాఫ్, బాషా, గంగాధర్, ఇమ్రాన్‌లు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

**పెద్దవడుగూరు – సూర్య వాస్తవం :** పెద్దవడుగూరు మండలంలోని తెలికి గ్రామంలో జరిగిన ఈ సంఘటన అత్యంత విచారకరం. వర్షం సమయంలో గొర్రెల మందను కాపాడుకుంటూ, సాంబశివుడు ఇలా పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటు. ముఖ్యంగా ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షాలు కురిసేటప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండటం ప్రాణాపాయంగా మారుతోంది. మృతుడి కుటుంబానికి భార్య మరియు ఇద్దరు పిల్లలు ఉన్నారని వారి పరిస్థితి నిజంగా హృదయ విదారకం. సాధారణంగా ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల మరణించిన వారికి ప్రభుత్వం నుండి పరిహారం అందే అవకాశం ఉంటుంది. స్థానిక రెవెన్యూ అధికారులు దీనిపై త్వరితగతిన స్పందించి, ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరుకుందాం.

## పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

**- లబ్ధిదారులకు ఆశాకిరణంగా ప్రభుత్వం**

**- పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు**

**పాల్గొన్న ఏఎంసి డైరెక్టర్ గోను బాబు**



**కనగానపల్లి – సూర్య వాస్తవం :** పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేస్తూ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం గ్రామాల్లో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఏఎంసి డైరెక్టర్ గోను బాబు పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా గోను బాబు మాట్లాడుతూ, సమాజంలోని వృద్ధులు, విధవలు, దివ్యాంగులు, నిరుపేదలు ఆర్థికంగా స్థిరపడేందుకు ఎన్టీఆర్ భరోసా పథకం ఒక గొప్ప ఆపన్నహస్తంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రతి నెలా లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు అందించడం ద్వారా ప్రభుత్వం వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. అలాగే, పింఛన్ అందుకుంటున్న వృద్ధులు ప్రభుత్వంపై కృతజ్ఞతాభావం వ్యక్తం చేస్తూ, తమకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉందని తెలిపారు. ఈ పథకం వల్ల తమ రోజువారీ ఖర్చులు నిర్వహించుకోవడం సులభమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ నాయకులు సచివాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుడే లోకానికి వెన్నెముక

**- అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు**



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఉరవకొండ జనసేన ఇంచార్జ్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ కార్మిక సోదరులకు మే డే శుభాకాంక్షలు మే డేను ఒక పండుగలా జరుపుకుంటారు. ప్రధానంగా ప్రతి ఊరిలోనూ, కూడళ్లలోనూ కార్మిక సంఘాలు (సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసి వంటివి) ఎర్ర జెండాలను ఆవిష్కరిస్తాయి. హైదరాబాద్, విశాఖ పట్నం, విజయవాడ వంటి నగరాల్లో కార్మికులు తమ హక్కుల కోసం భారీ ర్యాలీలు నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్మికులకు 'శ్రమ శక్తి' వంటి అవార్డులను అందజేసి గౌరవిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికుల సంఖ్య ఎక్కువ. వారు ఈ రోజును సెలవుగా పాటించి, సామూహికంగా వేడుకలు చేసుకుంటారు. కార్మికుల రక్షణ కోసం మన దేశంలో కొన్ని బలమైన చట్టాలు ఉన్నాయి. కనీస వేతన చట్టం ఏ యజమాని కూడా ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం కంటే తక్కువ ఇవ్వకూడదు. ఫ్యాక్టరీల చట్టం (ఫాక్టోరీస్ యాక్ట్ , 1948): పని ప్రదేశంలో గాలి, వెలుతురు, మంచినీరు, భద్రత, శానిటేషన్ వంటి వసతులు ఉండాలి. సమాన వేతన చట్టం (ఈక్వల్ రెమ్యూనరేషన్ యాక్ట్, 1976): ఒకే రకమైన పనికి స్త్రీ, పురుష భేదం లేకుండా సమాన వేతనం అందించాలి. ఈ.ఎస్.ఐ మరియు పి.ఎఫ్ కార్మికుల ఆరోగ్యం, పదవీ విరమణ తర్వాత భద్రత కోసం ఈ సౌకర్యాలు కల్పించడం తప్పనిసరి. అలాగే కార్మిక సోదరులకు జనసేన నాయకులకు, కార్యకర్తలకు మే డే శుభాకాంక్షలు తెలియజేసారు.

# పారిశుధ్య కార్మికులను సత్కరించిన తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు వేంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన శాంతి కుమారి, కుమార్ అను పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ కార్మికుని స్వేదం వెలకట్టలేనిది అన్నారు. మానవ నాగరికత ప్రస్థానం అంతా కార్మికుల కష్టంతోనే జరిగింది అన్నారు. పారిశుధ్య కార్మికులు చేసే సేవ తల్లి చేసే సేవ కంటే ఎక్కువ అన్నారు. కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బండారు వెంకటేశు, వేమారాజ, బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

**గౌతమ బుద్ధుని బోధనలు నేటి సమాజానికి అవసరం**

బౌద్ధ మత స్థాపకుడు అయిన గౌతమ బుద్ధుని బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు బుద్ధ పూర్ణిమ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ వైశాఖ పౌర్ణమి నాడు గౌతమ బుద్ధుని జననం, జ్ఞానోదయం, నిర్వాణం జరిగాయని,అందువల్ల వైశాక పూర్ణిమకు ప్రత్యేకత ఉందని, దీనిని బుద్ధ పూర్ణిమ అంటారని అన్నారు. మానవుని దుఃఖానికి మూల కారణం కోరికలని, కోరికలను నివారించడం ద్వారా దుఃఖాన్ని నివారించవచ్చునని,కోరికలను అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా నివారించవచ్చునని గౌతమ బుద్ధుడు బోధించాడు. బుద్ధుని బోధనలైన శాంతి, అహింస, సమతుల్య జీవన మార్గాలు అన్ని కాలాలకు, అన్ని ప్రాంతాలకు,అందరికీ వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి అలివేలమ్మ, కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, ధ్రువ కుమార్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేష్, బద్రి వేమా రాజా, తదితరులు పాల్గొన్నారు.

# అర్థమైందా వర్మ సార్

**- చంద్రబాబు నాయుడు మాటలు అర్థం అయ్యాయా వర్మ సార్**

**- కూటమినేతలు కలిసి ఉంటేనే కళదుసుఖం అంటున్న జనసేన నాయకులు**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డాక్టర్ హరీష్ నేతృత్వంలో జనసేన పార్టీ నాయకులు గోసల ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికైనా అర్థమైందా వర్మ సార్,అర్థం చేసుకొని కలిసిమెలిసి ఉండండి. ఫ్లెక్సీలు దగ్గర,కుర్చీల దగ్గర, ఫోటోల దగ్గర ఇదే మీ చిల్లర రాజకీయం అధికారంలో ఉన్నాం కదా అని తల పొగరుగా పోతే నష్టపోయేది మీరే అన్న చంద్రబాబు. చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ లోకేష్ ఎలాగ ఉన్నారో మన కూటమి పార్టీ కూడా అలాగే ఉందాం అని మాట్లాడారు. చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్నప్పుడు అన్ని మార్గాలు మూసివేసినప్పుడు పవన్ కళ్యాణ్ రోడ్డు మార్గాన వస్తుంటే అప్పటి ప్రభుత్వం అడ్డంకులు ఏర్పరిచి అతనిని వెళ్ళనీయకుండా చేయాలని ఉద్దేశంతో ఆపివేసింది. అయినా కూడా పట్టు వదలని విక్రమార్కుల్లా పవన్ కళ్యాణ్ రోడ్డుపైనే బైఠాయించి రోడ్డుకి అడ్డంగా నిలబడి ఎందుకు వెళ్ళనీరో చూద్దామని ఒక దృఢ సంకల్పంతో పోరాడి చంద్రబాబు నాయుడుని కలిశారు. కలిసిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఓట్లు చీలకూడదని ఉద్దేశంతో టిడిపి బిజెపితో పొత్తుకు ఒప్పుకున్నారు. తర్వాత లోకేష్ కు ఒక అన్నలాగా ఉంటానని మాట ఇచ్చారు. అన్న విధంగానే లోకేష్ చంద్రబాబు పవన్ కళ్యాణ్ బాగా అన్నదమ్ముల కంటే ఎక్కువగా కలిసిమెలిసి ఉన్నారు. ఈ సభాముఖంగా టిడిపి బిజెపి నాయకులకు మేము చెప్పేది ఒక్కటే అందరం కలిసి మెలిసి ఉందాం. పైన మన నాయకులు ఎలా అయితే కలిసున్నారో మనము కూడా ఎలాంటి ఈర్ష్య, అసూయలు లేకుండా కలిసి మెలిసి ఉందాం. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు మోగుతాయి. అలాగే మన పార్టీలు మనము కలిసి ఉంటే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుంది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సుధీర్ రెడ్డి, దేవా, శ్యామ్,ఇడుపులపాయ జయచంద్ర,థామస్,అంజి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 'ప్రకృతి సాగు'పై అవగాహన సదస్సు



**కనగానపల్లి – సూర్య వాస్తవం :** కనగానపల్లి మండల కేంద్రంలో అగ్రోఫారెస్ట్రీ -- క్లైమేట్ ప్రూఫింగ్ ఫార్మ్ లైవ్‌లీహుడ్స్ వాతావరణ మార్పులను తట్టుకుంటూ, సుస్థిరమైన ఆదాయం పొందే దిశగా రైతులకు దిశానిర్దేశం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. హ్యాండ్స్, శ్రేట్రీస్ సంస్థల సంయుక్త సహకారంతో జరిగిన ఈ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ సమావేశానికి రైతులతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశానికి 4 మండలాల పరిధిలోని 65 గ్రామాల నుండి సుమారు 110 మంది రైతులు హాజరయ్యారు. రైతులు తమ సాగు అనుభవాలను పంచుకుంటూ, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణ స్వామి రైతులకు 'ఘన జీవామృత లడ్డూల' తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. వీటిని పొలాల్లో వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను, నేల సారవంతం అయ్యే తీరును రైతులకు వివరించారు. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో రైతులకు 1 లక్ష మొక్కలను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వచ్చే ఏడాది మరో 50 వేల మొక్కలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. రైతులకు భరోసా ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి వల్ల మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు రక్షక తడులు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటేందుకు గ్యాప్ ఫిల్లింగ్ కార్యక్రమం కూడా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సేంద్రియ ఎరువుల తయారీకి అవసరమైన ఇన్‌పుట్స్ (సామగ్రి) అడిగారు. వాటిని అందించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అయితే, వీటిని దుర్వినియోగం చేయకుండా పొలాల్లో సక్రమంగా వినియోగించి అధిక దిగుబడులు సాధించాలి. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటేష్ నాయక్, ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణ స్వామి, రీజినల్ మేనేజర్ మనోహర్, ప్రోగ్రాం మేనేజర్స్ పీరావళి, కేశవ్, సాయిల్ ల్యాబ్ మేనేజర్ సుప్రజ, టెక్నికల్ అసోసియేట్స్, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సు ద్వారా అగ్రోఫారెస్ట్రీ (చెట్లతో కూడిన వ్యవసాయం) పై రైతులకు మంచి అవగాహన లభించింది. వాతావరణ మార్పులను తట్టుకుని నిలబడేందుకు ప్రకృతి వ్యవసాయమే సరైన మార్గమని అధికారులు నొక్కి చెప్పారు.



## నూతన శ్రీ సీతారామ విగ్రహ ప్రతిష్ట

## మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** బ్రహ్మంగారి మఠం మండలం, మద్దిరెడ్డిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్సీపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైసీపీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు ఆర్. రమేష్ యాదవ్ జిల్లా పరిషత్ ఛైర్మన్ ముత్యాల రామగోవింద రెడ్డి వైసిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి , వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు రత్న కుమార్ యాదవ్, చౌదరి వారి పల్లె మాజీ సర్పంచ్ చిన్న ఓబుల్ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించిన చిట్యాల కృష్ణమోహన్ రెడ్డి ధర్మపత్ని లెక్కల వరలక్ష్మి, లెక్కల రామకృష్ణారెడ్డి వైఎస్ఆర్పిపి మైదుకూరు నియోజకవర్గ స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, వైఎస్ఆర్పిపి నాయకులు లెక్కల రమణారెడ్డి, వైసిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులతో కలసి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు ఏర్పాటు చేసి ఆలయమర్యాదలతో ఘనంగా సన్మానించి శ్రీ రాములవారి చిత్రపటాలను అందజేశారు.



# 'కుక్కల రక్తం' విక్రయాలపై రేణు దేశాయ్ ఆగ్రహం!



హైదరాబాద్ లో కుక్కల రక్తం విక్రయాల దందా
రక్తం అమ్మేవాడికంటే కొనేవాడిదే పెద్ద తప్పు అన్న రేణు
తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్య
హైదరాబాద్ లో ఇటీవల వెలుగులోకి వచ్చిన కుక్కల రక్తం విక్రయాల ఉదంతం ఎంతో మంది మనసులను కలచివేసింది. మూగజీవాల పట్ల చూపుతున్న ఈ అమానుషత్వంపై నటి, సామాజిక కార్యకర్త రేణు దేశాయ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. కుక్కల రక్తం అక్రమ విక్రయాల దందాపై ఆమె తీవ్రంగా స్పందించారు. ఈ దారుణాలను చూస్తుంటే సమాజం ఎంతటి భయంకరమైన 'కలికాలం'లో ఉందో అర్థమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.
"మనుషులనే కిడ్నాప్ చేసి కిడ్నీలు అమ్మేసే కఠిన హృదయులు ఉన్న చోట, నోరులేని కుక్కలను వదులుతారని ఎలా అనుకుంటాం?" అని ఆమె ప్రశ్నించారు. రక్తం అమ్మేవాడి కంటే కొనేవాడిదే పెద్ద తప్పని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ రక్తం ఎక్కడి నుంచి వస్తోంది, ఎలా సేకరిస్తున్నారు అనే కనీస అవగాహన లేకుండా కొనడం వల్ల ఇలాంటి అక్రమ దందాలకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. తప్పు చేసిన వారు ప్రకృతి సిద్ధమైన శిక్ష నుంచి తప్పించుకోలేరని ఆమె పేర్కొన్నారు. "ప్రతి ఒక్కరూ కర్మ సిద్ధాంతాన్ని గుర్తుంచుకోవాలి.
మనం చేసే ప్రతి తప్పుకు ఫలితం అనుభవించాల్సిందే. మనం చేసే కర్మ మనకు కచ్చితంగా తిరిగి వస్తుంది" అని ఆమె హెచ్చరించారు.

# జూన్ 4న వస్తున్న రామ్ చరణ్ పెద్ది... ఇది పక్కా!



రామ్ చరణ్ 'పెద్ది' విడుదల తేదీ ఖరారు
జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్
సినిమా షూటింగ్ మొత్తం పూర్తయినట్టు ప్రకటన
ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన స్పెషల్ సాంగ్‌పై భారీ అంచనాలు
అద్భుతమైన థియేటర్ అనుభవం కోసమే విడుదల వాయిదా వేసినట్టు గతంలో వెల్లడి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, డైరెక్టర్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ రూరల్ యాక్షన్ డ్రామా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను ఈ ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్టు శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు రామ్ చరణ్ తన సోషల్ మీడియా ఖాతాలో, "జూన్ 4న 'పెద్ది'ని కలవండి. థియేటర్లలో కలుసుకుందాం" అని పోస్ట్ చేశారు. ఈ మేరకు రిలీజ్ పోస్టర్ ను కూడా పంచుకున్నారు.
సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిన వెంటనే ఈ ప్రకటన రావడం గమనార్హం. మే 1వ తేదీ తెల్లవారుజామున, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు 'పెద్ది' షూటింగ్ పూర్తయినట్టు ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌తో తన ప్రయాణం గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "రామ్ చరణ్‌తో 'పెద్ది' ఒక మధురమైన ప్రయాణం. ఆయనతో పనిచేయడం చాలా ప్రత్యేకం. తెరపై పవర్‌హౌస్ పెర్ఫార్మర్, తెర వెనుక అద్భుతమైన స్నేహితుడు. మేమిద్దరం కలిసి సృష్టించిన జ్ఞాపకాలకు కృతజ్ఞతలు" అని రత్నవేలు పేర్కొన్నారు. ప్రతి ఫ్రేమ్‌లో అద్భుతమైన నటనను ప్రదర్శించడమే కాకుండా, నిజ జీవితంలోనూ ఎంతో స్నేహపూర్వకంగా ఉండే వ్యక్తి అని చరణ్‌ను ఆయన కొనియాడారు.
ఈ సినిమా కోసం చివరిగా ఒక స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించినట్టు గతంలోనే వార్తలు వచ్చాయి. హైదరాబాద్‌లో రామ్ చరణ్‌పై ఈ పాటను చిత్రీకరించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాటలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ఒక సర్‌ప్రైజ్ ఎలిమెంట్ ఉంటుందని యూనిట్ వర్గాలు తెలిపాయి. ట్యూన్, డ్యాన్స్, గ్రాండ్ సెట్, అందులోని సర్‌ప్రైజ్‌తో ప్రేక్షకులు థియేటర్లలో ఉర్రూతలూగడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇది మరో చార్ట్‌బస్టర్ అవుతుందని అప్పట్లో పేర్కొన్నారు.
వాస్తవానికి ఈ సినిమాను ముందుగా విడుదల చేయాలని భావించినా, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు మరింత సమయం కేటాయించేందుకే జూన్‌కు వాయిదా వేస్తున్నట్టు వారం క్రితం నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ ప్రకటించింది. "మా సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న స్పందన అద్భుతంగా ఉంది. సినిమా టాకీ పార్ట్ పూర్తయింది, కేవలం ఒక పాట మాత్రమే మిగిలి ఉంది. ఎడిట్ చూసుకున్నాం, అవుట్‌పుట్‌తో చాలా సంతోషంగా ఉన్నాం. ఇంత మంచి కంటెంట్‌ను అత్యుత్తమంగా అందించాలనుకుంటున్నాం. అందుకే మా టెక్నీషియన్లకు, పోస్ట్ ప్రొడక్షన్ బృందానికి కాస్త ఎక్కువ సమయం ఇచ్చి, పూర్తి నాణ్యతతో మీ ముందుకు రావాలని నిర్ణయించుకున్నాం" అని ఆ ప్రకటనలో వివరించింది. అందుకే సినిమాను జూన్‌కు వాయిదా వేస్తున్నామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపింది. ఇప్పుడు ఆ తేదీని ఖరారు చేశారు.

బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది'పై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నటులు శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతికంగానూ ఈ సినిమా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కుతోంది. ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్షన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



# రాజస్తాన్ రాజసం

- రియాన్ పరాగ్ కెప్టెన్సీ ఇన్నింగ్స్
- ఢిల్లీ క్యాపిటల్స్ లక్ష్యం
- 227 పరుగులు



**జైపూర్:** రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ ధనా ధన్ ఇన్నింగ్స్ తో దుమ్మురేపాడు. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(6), వైభవ్ సూర్యవంశీ (4)లు నిరాశపరిచినా.. జట్టుకు కెప్టెన్ ఇన్నింగ్స్‌తో భారీ స్కోర్ అందించాడు. ధ్రువ్ జురెల్(42)కి తోడు డెత్ ఓవర్లలో డొనొవాన్ ఫెరీరా(47 నాటౌట్) ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. దీంతో రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఈ సీజన్‌లో బౌలర్ల పాలిట కొరకరాని కొయ్యలా మారిన రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీకి జేమీసన్ బ్రేకులు వేశాడు. తొలి బంతినే బలంగా కొట్టి స్ట్రెయిట్ బౌండరీగా మలిచిన వైభవ్‌ను ఈ పొడగరి పేసర్ లో-ఫుల్‌టాస్‌తో బురిడీ కొట్టించాడు. బంతిని అడ్డుకునేందుకు వైభవ్ ప్రయత్నించినా.. వికెట్ కాపాడుకోలేకపోయాడు. అంతకుముందు ఇన్నింగ్స్ మొదటి ఓవర్ మొదటి బంతికే సిక్సర్ బాదిన యశస్వీ జైస్వాల్(6)ను ఫుల్‌టాస్‌తో స్టార్క్ ఔట్ చేసి తొలి వికెట్ సాధించాడు. వరస ఓవర్లలో ఓపెనర్లను కోల్పోయిన రాజస్థాన్ ఇన్నింగ్స్‌ను కెప్టెన్ రియాన్ పరాగ్(90), ధ్రువ్ జురెల్ ఆదుకున్నారు. ఈ క్రమంలో రాజస్తాన్ జట్టు 6వ ఓవర్లో 56 పరుగులు చేసింది. శతక

భాగస్వామ్యంతో..

తొలి 2 ఓవర్లలోనే రెండు వికెట్లు తీసి రాజస్థాన్‌ను దెబ్బకొట్టిన ఢిల్లీ బౌలర్లను పరాగ్, జురెల్ దంచేశారు. అక్షర్ పటేల్‌ను ఉతికేసిన పరాగ్ రెండు సిక్సర్లతో స్కోర్ బోర్డును ఉరికించాడు. అటాకింగ్ గేమ్‌తో ఈ ద్వయం మూడో వికెట్‌కు శతక భాగస్వామ్యం నెలకొల్పింది. అర్ధ శతకానికి చేరువైన జురెల్ ఔటవ్వడంతో102 పరుగులు జోడించిన అనంతరం ఈ జోడీ అక్షర్ పటేల్ విడదీశాడు. జడేజా(20)ను, సెంచరీకి దగ్గరైన పరాగ్‌ను స్టార్క్ ఔట్ చేసి మూడో వికెట్ సాధించాడు. గత మ్యాచ్‌లో ఆర్సీబీపై చెలరేగిన ఫెరీరా(47 నాటౌట్) సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. కుల్దీప్ వేసిన 18వ ఓవర్లో ఫెరీరా బంతిని మూడుసార్లు స్టాండ్స్‌లోకి పంపాడు. ఇన్నింగ్స్ ఇవరి ఓవర్లో నటరాజన్‌కు చుక్కలు చూపిస్తూ.. ఫెరీరా 4, 6, 4 కొట్టగా.. ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 225 పరుగులు చేసింది.

స్కోర్ బోర్డు...
రాజస్తాన్ రాయల్స్ : జైస్వాల్ (సి అండ్ బి)స్టార్క్ 6, సూర్యవంశీ (బి)జేమీసన్ 4, జురెల్ (సి)స్టబ్స్ (బి)అక్షర్ పటేల్ 42, రియాన్ పరాగ్ (సి)అక్షర్ పటేల్ (బి)స్టార్క్ 90, జడేజా (సి)అశుతోష్ శర్మ (బి)స్టార్క్ 20, ఫెరీరా (నాటౌట్) 47, దూబే (సి)అశుతోష్ శర్మ (బి)నటరాజన్ 6, ఆర్చర్ (నాటౌట్) 1, అదనం 9 (20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి) 225 పరుగులు. వికెట్ల పతనం: 1/6, 2/12, 3/114, 4/167, 5/168 బౌలింగ్: స్టార్క్ 4-0-45-3, జేమీసన్ 4-0-48-1, అక్షర్ పటేల్ 4-0-39-1, కుల్దీప్ యాదవ్ 4-0-41-0, నటరాజన్ 4-0-54-1.

# థామస్ కప్ సెమీస్ కు భారత్

- క్వార్టర్ ఫైనల్లో చైనీస్ తైపీపై గెలుపు




కోపెన్ హేగన్(డెన్మార్క్): థామస్ కప్ సెమీఫైనల్లోకి భారత పురుషుల జట్టు ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 3-0తో చైనీస్ తైపీపై విజయం సాధించింది. తొలి సింగిల్స్ లో లక్ష్యసేన్ తో వరుస సెట్లలో ఛౌ-టిన్-చెన్ ను ఓడించి భారత్ కు 1-0ఆధిక్యతలో నిలిపాడు. ఆ తర్వాత జరిగిన డబుల్స్ లో చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ మూడు సెట్ల హోరాహోరీ పోరులో తైపీ జంటను చిత్తుచేశారు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్ లో భారత ద్వయం 23-21, 19-21, 21-12తో తైపీ జంటను ఓడించారు. దీంతో భారత్ తిరుగులేని 2-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఇక రెండో సింగిల్స్ లో 20ఏళ్ల ఆయుష్ శెట్టి కూడా అంచనాలకు మించి రాణించాడు. ఉత్కంఠ భరితంగా సాగిన ఆ మ్యాచ్ ను ఆయుశ్ శెట్టి21-16, 21-17తో లిన్-చున్-యు ను ఓడించాడు. దీంతో భారతజట్టు 3-0తో విజయం సాధించి సెమీస్ కు చేరింది. ఇతర క్వార్టర్ ఫైనల్ పోటీల్లో చైనా 3-0తో మలేషియాపై విజయం సాధించి సెమీస్ కు చేరింది. జపాన్-ఫ్రాన్స్ జట్ల మధ్య జరిగే మరో క్వార్టర్ ఫైనల్ విజేతతో సెమీస్ లో భారత్ తలపడనుంది.

## నేడు చైనీస్ తైపీతో భారత్ ఢీ

- థామస్ కప్ ఫైనల్స్



ఒడెన్స్(డెన్మార్క్): థామస్ కప్ లో భారత పురుషుల జట్టు శుక్రవారం చైనీస్ తైపీతో తలపడనుంది. గ్రూప్-ఎలో రెండో స్థానంలో నిలిచిన భారతజట్టు.. గ్రూప్-సిలో అగ్రస్థానంలో ఉన్న చైనీస్ తైపీతో అమీ తుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ లో భారత్ గెలిస్తే సెమీస్ కు చేరనుంది. సింగిల్స్ బరిలో లక్ష్యసేన్, హెచ్ ఆర్ ప్రణయ్, ఆయుశ్ శెట్టితోపాటు డబుల్స్ లో సాత్విక్-చిరాగ్ శెట్టి రాణిస్తే భారత్ సెమీస్ కు చేరడం ఖాయం. గురువారం జరిగే ఇతర క్వార్టర్ ఫైనల్ పోటీల్లో చైనా-మలేషియా, థాయ్ లాండ్-డెన్మార్క్, ఫ్రాన్స్-జపాన్ జట్లు తలపడనున్నాయి. ఇక మహిళల ఉబర్ కప్ సెమీఫైనల్లోకి చైనా, జపాన్ ప్రవేశించాయి. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో చైనా 3-0తో మలేషియాను, జపాన్3-1తో థాయ్ లాండ్ ను ఓడించాయి. మిగిలిన రెండు సెమీస్ బెర్త్ ల కోసం డెన్మార్క్-ఇండేనేషియా, చైనీస్ తైపీ-కొరియాల మధ్య పోటీ జరగనుంది.

# మాటల మాంత్రికుడు నరేంద్ర మోడీ

- లేబర్ కోడ్లను రద్దు చేయాలి
- సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్. రాధాకృష్ణ
- బ్రిటిష్ ప్రభుత్వాన్ని కలిగిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం
- పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి
- కార్మికులకు అండగా సిఐటియు జెండా
- సమస్యలకు వెరవం.. ఉద్యమాలకు సిద్ధం
- సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర
- సిఐటియు కార్యాలయం నుండి భారీ సంఖ్యలో కార్మికుల ర్యాలీ
- పట్టణంలో హోరెత్తిన కార్మిక దినోత్సవం మే డే
- బహిరంగ సభ జన సంద్రోహం మధ్య విజయవంతం






**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం :** మే డే ప్రపంచ 140వ కార్మిక దినోత్సవం సిఐటియు తలపెట్టిన ర్యాలీ బహిరంగ సభ విజయవంతం పత్తికొండ పట్టణంలో 140వ మే డే ప్రపంచ కార్మిక దినోత్సవం సిఐటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముందుగా సివిల్ సప్లై గోడౌన్ హమాలీ వర్కర్స్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ దగ్గర జండా ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని ముఖ్యంగా మారెళ్ళ ఆర్ఎస్ పెండేకల్ ఆటో కార్మికుల అడ్డాల దగ్గర జండా ఆవిష్కరించి చందోలి తుగ్గలి ఆటో కార్మికుల అడ్డాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. అనంతరం కోర్టు సమీపంలో ఉన్న స్తూపం దగ్గర జండా ఆవిష్కరణ చేసిన అనంతరం అంబేద్కర్ సర్కిల్ దగ్గర ఉన్న సిఐటియు కార్యాలయం దగ్గర సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, చేతులమీదుగా జండా ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం అక్కడి నుండి నాలుగు స్తంభాల కూడలి మీదుగా కుమ్మరి వీధిలో ఉన్న సిపిఎం పార్టీ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణానికి భారీ సంఖ్యలో కార్మికులు మేడే వర్ధిల్లాలి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి కార్మిక రాజ్యం రావాలి అంటూ నినాదాలు నినాదాలు చేస్తూ అక్కడికి చేరుకున్నారు. బహిరంగ సభ ప్రాంగణంలో మేడే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పత్తికొండ మండల సిఐటియు కార్యదర్శి ఎం. రవిచంద్ర, అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ మాటల గారడీతో కార్మికులను మోసం చేస్తున్నారని ఎన్నో ఏళ్ల నుండి కార్మికులకు ఉపయోగపడే 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం వెనుక కేవలం కార్పొరేట్ శక్తులను పెంచి పోషించడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల కర్షకుల పట్ల కష్టజీవులు శ్రమజీవుల పట్ల కనికరం లేకపోవడం కేవలం ఆదానీ అంబానీ రిలయన్స్ టాటా మెటల్ ఇలాంటి పెద్ద పెద్ద సంస్థలకు దాసోహమై వారు చెప్పినట్లు వింటూ రాష్ట్రాల్లో ఉన్న నరేంద్ర మోడీ కి వత్తాసు పడుతున్న ప్రభుత్వాలను కూడా కార్పొరేటు శక్తులకు ఊడిగం చేసే విధంగా తయారు చేస్తున్నారని ఉదాహరణకు మన రాష్ట్రంలోని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి తనయుడు విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ 95 పైసలకే భూములు లీజుకి ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని సామాన్యునికి ఈ ప్రాతిపదికన మీ భూములు అదే 95 పైసలకే లీజులకు ఇస్తారా అని ఎద్దేవా చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం గడచిన పదేళ్లలో బ్రిటిష్ ప్రభుత్వానికి ఏమాత్రం తీసిపోకుండా ఉందని నరేంద్ర మోడీ ప్రభుత్వమే రాబోయే రోజుల్లో కూడా కొనసాగితే బ్రిటిష్ పాలకులు మాదిరిగా సామాన్య ప్రజలు కార్మికులు జైళ్లలో మగ్గి బానిసత్వంలో కుంగిపోవాల్సిందేనన్నారు కార్మికులకు కర్షకులకు కష్టజీవులకు శ్రమజీవులకు కేవలం సిఐటియు జండా వల్లనే వారి హక్కులను సాధించుకునే వెసులుబాటు ఉందని అందుచేత కార్మికులు కష్టజీవులు స్కీమ్ వర్కర్లు సీఐటీయూ జండాను రెపరెపలాడించాలని సిఐటియులతోనే అన్ని సమస్యలకు పరిష్కారం అని దేశంలోనే దాదాపుగా 70 నుండి 80 లక్షల దాకా ఉన్న సంఘం ఏదైనా ఉంది అంటే అది కేవలం సిఐటియు సంఘం మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం హెల్త్ సిఐటియు రాష్ట్ర సెక్రెటరీ సంధ్యారాణి, సిఐటియు మండల అధ్యక్షులు డి గోపాల్, సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, దస్తగిరి, గంగన్న,, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు చిట్టెమ్మ, మండల కార్యదర్శి సావిత్రిబాయి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బుజ్జులు, అధ్యక్షులు శికామణి, పట్టణ కార్యదర్శి నరసన్న, రైతు సంఘం మండల అధ్యక్షులు పెద్దహుల్తి రాజుల కారప్ప, అమలి యూనియన్ నాయకులు చంద్ర, హుస్సేన్, ఉరుకుందు, చంద్ర, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు శివ,, రమేష్, పుచ్చకాయల మండల రాముడు, హోసూరు హమాలి వర్కర్ సీనియర్ నాయకులు రామాంజనేయులు, పత్తికొండ గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు నరసన్న ఆశా కార్మికులు అంగన్వాడీలు ఉపాధి హామీ కూలీలు సిఐటియు మండల కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భర్త పింఛన్ భార్యకు బదిలీ



**తొండూరు – సూర్య వాస్తవం:** తొండూరు మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలో కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది సత్వర సేవలు అందించారు. గ్రామానికి చెందిన వెన్నుపూస అశ్వర్థ రెడ్డి వృద్ధుడు ఇటీవల మరణించగా, ఆయన పేరుపై వస్తున్న వృద్ధాప్య పింఛన్‌ను వెంటనే భార్య వెన్నపూస పుల్లమ్మ పేరుపైకి బదిలీ చేసి వితంతు పింఛన్‌గా మంజూరు చేశారు. శుక్రవారం 1వ తేదీ కావడంతో సచివాలయ సిబ్బంది సదరు వితంతు మహిళ ఇంటికి స్వయంగా వెళ్లి బయోమెట్రిక్ ద్వారా రూ.4,000 నగదు పింఛన్ అందజేశారు. భర్త మరణించిన బాధలో ఉన్న ఆ మహిళకు నెలలో పింఛన్ అందడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# పెన్నాఅహోబిలం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన జనసేన పార్టీ నాయకులు





**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఉరవకొండ జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఆగస్థ్య చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు.

ఈ సందర్భంగా ఉరవకొండ మండల అధ్యక్షులు ఆగస్థ్య చంద్రశేఖర్ మాట్లాడుతూ, గత ఐదేళ్ల పాలనలో పెన్నా అహోబిలం దేవస్థానం అనేక వివాదాలకు కేంద్రంగా మారిందని, దీనివల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం పవిత్ర ఆలయాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కోనేటిలో పూడికలు తొలగించి స్నానానికి అనుకూలంగా మార్చడం, మాడవీధుల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయడం, నీడ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం, నీటి సమస్య రాకుండా రెండు బోర్లు తవ్వించడం, అలాగే 60కి పైగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి చర్యలు తీసు కున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు బోయ దేవేంద్ర, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు గుడిసెల రాజేష్, నాయకులు ప్రియతమ్, భోగేష్, రమణ, మనోజ్, మునిరంగ తదితరులు పాల్గొన్నారు.

## పులివెందులను

# ఆదర్శమున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- ప్రజల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు
- పెండింగ్ పనుల మరమ్మతులకు రూ.10 కోట్లతో యుద్ధప్రతిపాదికన పనులు పూర్తి చేస్తాం
- పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి



**పులివెందుల – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పేదలు, వృద్ధులకు ఒకటో తేదీ ఒక పండుగలా మారింది. ఎన్నికల సమయంలో మేమిచ్చిన హామీ ప్రకారం పింఛనును 3,000 నుండి 4,000 రూపాయలకు పెంచడం జరిగింది. ఒకటో తేదీ ఆదివారం లేదా సెలవు దినం వచ్చినా సరే, ముందస్తుగానే పింఛను సొమ్మును లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమైనప్పటికీ, ఇచ్చిన మాట కోసం ఎక్కడా రాజీ పడకుండా పింఛన్ల పంపిణీని సకాలంలో చేపడుతున్నాం. ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గం నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ, ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉండటం దురదృష్టకరం. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటికీ కుళాయి ఇచ్చే పథకాన్ని మరో 15 రోజుల్లో పూర్తి చేయనున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తో కలిసి దీనికి శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులు, రోడ్ల మరమ్మతుల కోసం 10 కోట్ల రూపాయల జనరల్ ఫండ్స్ విడుదల చేసి యుద్ధప్రతిపాదికన పనులు పూర్తి చేస్తాం. ప్రజల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి, 24 గంటల్లోనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. పులివెందులను ఒక అందమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మేడే దినోత్సవం

**కదిరి – సూర్య వాస్తవం :** అంతర్జాతీయ మేడే దినోత్సవం కదిరిలో సిఐటియు ఆధ్వర్యంలో సిమ్స్ హాస్పిటల్ ఎండి ఎస్సార్ యాసిన్ ఖాన్ సౌజన్యంతో ఘనంగా నిర్వహించారు శుక్రవారం రోడ్లు భవనాల అతిథి గృహం నుంచి ర్యాలీగా బయలు దేరి సిమ్స్ హాస్పిటల్‌లో చేరుకున్నారు. ర్యాలీలో విద్యార్థుల, చిన్నారుల, చెక్కభజన ఎంతగానో ఆకట్టుకున్నది. సిమ్స్ హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిసార్ యాసీన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల యొక్క చెమట ఆరకముందే అతని యొక్క కూలిని చెల్లించాలని మహమ్మద్ ప్రవక్త తెలియజేశారని, కార్మికుల హక్కుల కోసం ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉంటానని, మే డే ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. అనంతరం ఆర్టీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యాకూబ్ ఖాన్, ఆశా యూనియన్ నాయకులు రమాదేవి, అంజనమ్మ మున్సిపల్ యూనియన్ నాయ కులు తిరుపాల్, జనార్ధన్, బాలకృష్ణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఫాజిల్, రమేష్, సివిల్ సప్లై యూనియన్ శివప్రసాద్, ఫక్రుద్దీన్, అగ్రికల్చర్ యూనియన్ పద్మావతి, స్కూల్ స్వీపర్స్ ఇందిరమ్మ, నాగభూషనమ్మా, షాహిస్తా బేగం, కెవిపిఎస్ నారాయణ, గిరిన సంఘం కృష్ణా నాయక్, ఐద్వా శాంతి బాయి, యూటీఎఫ్ ఖాజా మోహియోద్దీన్‌లను ఆత్మీయంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సి ఐ టి యు నాయకులు సాంబశివ, జగన్, బాబ్జాన్, ఆవాజ్ నాయకులు ముస్తాక్, యుటిఎఫ్ నాయకులు ఖాజా మోహియోద్దీన్, సిమ్స్ హాస్పిటల్ సిబ్బంది, పలు సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.




# పదవ తరగతిలో మెరిసిన కేజీబీవీ పాఠశాల ఆణిముత్యాలు



**గార్లదిన్నె– సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండలం కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలలో మొత్తము 38 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందులో 35 మంది విద్యార్థినులు పాస్ అయినారు ఇందులో కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఫెయిల్ అయినారు ఇందులో 9మంది విద్యార్థినిలు 500 కు పైగా మార్కులు సాధించినారు వారిలో ప్రథమ స్థానంలో జి. హర్షిత 556/600, కోటంక గ్రామం, రెండవ స్థానంలో కె. రమ్యశ్రీ 538/600, పెనకచర్ల గ్రామం, తృతీయ స్థానంలో హెచ్. మేరీ కుమారి 529/600 తిమ్మంపేట కె.శ్వేత 524, ఎం. ఉమామహేశ్వరి 519, ఎం. మణి.512, కె. వందన. 503, బి. దీపిక 501, ఆర్.బిందు 500 మార్కులుగా విజయం సాధించారు. పదవ తరగతిలో పాసైన విద్యార్థిను లందరినీ ప్రిన్సిపాల్ నాగసత్య చరవాణి ద్వారా అభినందించారు. అలాగే ఉపాధ్యాయినిలను కూడా అభినందించారు. గార్లదిన్నె కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతిలో పాసైన విద్యార్థులందరూ రైతాంగం కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థినిలే కష్టపడి చదివితే ఎక్కడైనా రాణించగలమని ఈ విద్యార్థినిలు నిరూపించారు.

ఈ విద్యార్థులకు విద్య నేర్పిన ఉపాధ్యాయినిలు ఎంతో కష్టపడి పిల్లలను క్రమశిక్షణతో చదువులు చెప్పినందుకుగాను విద్యార్థినిలు ఎంతో కష్టపడి చదువులు చెప్పిన గురువుల మీద అభిమానం శ్రద్ధతో పరీక్షలు రాసి తమ ప్రతిభను నిరూపించుకున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )

# హిందీ భాషాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తా

## - కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ హిందీ సలహాదారుడు గైబువల్లి



**అనంతపురం – సూర్య వాస్తవం:** హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తానని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి, హిందీ సేవా సదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి హామీ ఇచ్చారు. న్యూఢిల్లీలోని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ హిందీ సలహాదారుడిగా శుక్రవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి కృష్ణపాల్ గుర్జర్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. పాతికేళ్ళుగా హిందీ భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి తనను హిందీ సలహాదారుడుగా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సహకార శాఖలో హిందీ భాషాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై పలు సూచనలు, సలహాలు అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర హోమ్, సహకార శాఖ మంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి కృష్ణపాల్ గుర్జర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహకార శాఖ కార్యదర్శి ఆశిష్ కుమార్ భూటానీ, సంయుక్త కార్యదర్శి రామన్ కుమార్, రాజ్య భాష విభాగం డైరెక్టర్ అహ్మద్, ఎంపీ కులదీప్ ఇందొరా పాల్గొన్నారు.

# కూటమి పాలనలోనే కార్మిక, శ్రామికులకు మెరుగైన ప్రయోజనాలు

## - రాయదుర్గం మేడే సభలో ఎమ్మెల్యే కాలవ



**రాయదుర్గం – సూర్య వాస్తవం :** కూటమి పాలనలోనే కార్మికులు, శ్రామికులకు మెరుగైన ప్రయోజనాలు లభిస్తున్నాయని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మే డే సందర్భంగా శుక్రవారం రాయదుర్గంలో మహనీయుడు, కార్మిక పక్షపాతి, శ్రామిక శ్రేయోభిలాషి నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా నిర్దిష్టమైన పని గంటలు, మెరుగైన వేతనాల కోసం జరిగిన అనేక పోరాటాల ఫలితంగా మే డే ఏర్పడిందని, ఇది కార్మికులందరికీ గొప్ప పండుగ రోజని తెలిపారు. ఈ శుభ సందర్భంలో కార్మికుల మధ్య మే డే వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం, చేనేత కార్మికులకు ప్రోత్సాహకాలు, విద్యుత్ సబ్సిడీలు వంటి పథకాలను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. అసంఘటిత కార్మికుల సంక్షేమంలో కూడా రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని, కేంద్ర ప్రభుత్వం కూడా ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. కార్మికులు, శ్రామికులందరూ మెరుగైన జీవితాలు గడపాలని, వారి కుటుంబాల ఆర్థిక స్థితి పెరగాలని లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, మాజీ చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ టశీకశాల హనుమంతు, నాయకులు పూజారి తిప్పయ్య,గుద్దిటి లోకేష్,బుదురు తిప్పేస్వామి, భలే శంకర్, ఇనాయత్, డబ్బిడి శివ, కొండాపురం శ్రీనివాసులు,ఎల్లప్ప,పోరాళ్ల ధనర్జున,పైతోట అంజి తదితరులు పాల్గొన్నారు.



# చిల్లకూరు సొసైటీ చైర్మన్‌కు పితృవియోగం

### - గ్రామంలో విషాద ఛాయలు
### - వడదెబ్బతో వృద్ధుడి ఆకస్మిక మృతి
### - చెన్నై హాస్పిటల్లో చికిత్సలో ఉన్న కుమారుడు హుటాహుటిన స్వగ్రామానికి చేరిక



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పరిధిలోని చిల్లకూరు సొసైటీ చైర్మన్ కె.వి. నాయుడు గారి తండ్రి కొచ్చర్ల వెంకమ నాయుడు (80) ఈరోజు ఉదయం సుమారు 10.30 గంటల ప్రాంతంలో ఆకస్మికంగా మరణించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, గత రెండు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వయోభారం కారణంగా వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు వెల్లడించారు. మరణానికి ముందు వరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇదిలా ఉండగా, కుమారుడు, చిల్లకూరు సొసైటీ చైర్మన్ కె.వి. నాయుడు ఇటీవల అనారోగ్యంతో చెన్నైలోని విజయ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. తండ్రి మరణ వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన స్వగ్రామం రావులపాడు చేరుకున్నారు. మృతదేహానికి రేపు ఉదయం 8.30 గంటలకు రావులపాడులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మాస కళ్యాణం, నిత్య అన్నదానం, పూజకు 5 లక్షలు విరాళం



**బ్రహ్మంగారిమఠం –సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం నకు తిరుపతి వాస్తవ్యులు గిన్నెల హరి గోపాల్ ధర్మపతి లక్ష్మీదేవి మరియు కుటుంబ సభ్యులు భాద్రపద శుద్ధ ద్వాదశి , జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి మరియు కార్తీక శుద్ధ ద్వాదశి రోజులలో మాస కళ్యాణం కొరకు రూ. 3,00,000/- లు ,మే - 11 వ తేదీన శాశ్వత నిత్య అన్నదానమునకు రూ.50,000/- లు జూన్ - 30 వ తేదీన శాశ్వత పూజకు రూ.1,50,000/- లు మొత్తం వెరసి రూ.5,00,000/- లు చెల్లించారు. వీరికి శ్రీ మఠాధిపతుల వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆజ్ఞ మేరకు మేనేజరు ఈశ్వరయ్య ఆచారికి అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ మర్యాదలతో శాలువా కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశీస్సులు ఆ కుటుంబం కు ఎల్లవేళలా ఉండాలని కోరారు.

# సామాజిక సేవలో భాగస్వాములు కండి

## - ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి




**రాయదుర్గం –సూర్య వాస్తవం :** రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పదవీ విరమణ పొందిన సిడిపిఓ పద్మావతికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం రూరల్ పరిధిలోని మద్యనేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన పద్మావతి పదవీ విరమణ సత్కార సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పద్మావతి లాంటి పట్టుదల, క్రమశిక్షణ కలిగిన అధికారి పదవీ విరమణ పొందడం ఐసీడీఎస్ విభాగానికి తీరని లోటని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆమె అందరినీ కలుపుకొని వెళ్తూ మెరుగైన ఫలితాలు సాధించారని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది సహజ ప్రక్రియ అని, ఆమె శేష జీవితాన్ని సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గంలో బాల్య వివాహాలను అరికట్టడం, బాలికా విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, భవిష్యత్తులో ఆమె ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

# ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

**అన్నమయ్య –బ్యూరో సూర్య వాస్తవం:** శుక్రవారం ఉదయం గుర్రంకొండ మండలంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు కె ఎస్ అక్బర్ వల్లి, షేక్ ఖాదర్ భాష, ఎం రహమతుల్లా ఇంటి వద్దకు వెళ్లి కలెక్టర్ చేతుల మీదుగా వృద్ధాప్య పింఛను అందజేశారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో బయోమెట్రిక్ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే వేలిముద్ర తీసుకుని నగదును లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి వద్దనే పెన్షన్ అందుతుందా, ఏ రోజు పింఛను అందుతోంది, ఎన్ని గంటల సమయంలో అందుతుంది, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సుంకలమ్మ, ముత్యాలయ్య బండిశీల మహోత్సవం!



**పెద్దవడూగురు – సూర్య వాస్తవం :** పెద్దవడూగురు మండలం గుత్తిఅనంతపురం గ్రామంలో జరిగిన సుంకలమ్మ ముత్యాలమ్మ బండిశీల మహోత్సవం వేడుకలను భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎంతో వైభవంగా బండిని పూలమాలలతో ఎంతో అందంగా అలంకరించి, గుత్తిఅనంతపురం, కాసేపల్లి, రామరాజపల్లి, భక్తులు వారి ఎద్దులను ఎంతో అందంగా ముస్తాబు చేసి వాటిని బండికి కట్టి బండిని ఉత్సాహంగా ఊరేగిస్తారు. ఇది ఈ ప్రాంతంలోని సాంప్రదాయానికి ప్రతీక. భక్తుల జనసందోహం: గ్రామస్తులు, చుట్టుపక్కల ప్రాంతాల వారు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకొని సుంకులమ్మ ముత్యాలయ్య స్వామి వారి ఆశీస్సులు తీసుకుంటారు. సుంకలమ్మ, ముత్యాలయ్య మహోత్సవం గ్రామ సంక్షేమం కోసం, పాడిపంటలు బాగుండాలని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఇలాంటి సాంప్రదాయ వేడుకలు గ్రామాల్లో ఐక్యతను, భక్తిని చాటిచెబుతాయి.

# మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా

### బైక్ ర్యాలీతో కార్మిక ఐక్యత ప్రదర్శన
### - ఆటోనగర్ కోసం గళమెత్తిన మెకానిక్స్

**నాయుడుపేట– సూర్య వాస్తవం:** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నాయుడుపేట మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. అసోసియేషన్ కార్యాలయం నుండి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మెకానిక్స్ భారీ సంఖ్యలో బైకులతో ర్యాలీ నిర్వహించి కార్మికుల ఐక్యతను చాటారు. ర్యాలీ సందర్భంగా మెకానిక్స్ "కార్మికుల ఏకత్వం -- సమాజ అభివృద్ధికి బాట", "ఆటోనగర్ వెంటనే ఏర్పాటు చేయాలి" వంటి నినాదాలు చేస్తూ పట్టణ ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఈ ర్యాలీ నాయుడుపేటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అలీ మాట్లాడుతూ, "మెకానిక్ వృత్తి సమాజానికి కీలకమైనది. మన శ్రమతోనే చక్రాలు తిరుగుతున్నాయి. మెకానిక్స్‌కు తగిన గౌరవం, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఆటోనగర్ ఏర్పాటు మెకానిక్స్ భవిష్యత్తుకు అత్య వసరం," అని పేర్కొన్నారు. వైస్ ప్రెసిడెంట్ తిరునమల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ, "మెకానిక్ వృత్తి అనేది కేవలం ఉపాధి కాదు… ఇది సమాజాన్ని ముందుకు నడిపించే శక్తి. మన చేతులు గ్రీజ్‌తో నిండిపోయి ఉండొచ్చు, కానీ అదే చేతులు ప్రజల జీవనయాత్రను సాఫీగా కొనసాగిస్తున్నాయి," అని అన్నారు. "మన శ్రమకు తగిన గౌరవం రావాలంటే మనం ఐక్యంగా ఉండాలి. ప్రస్తుతం మెకానిక్స్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య స్థిరమైన పని స్థలం లేకపోవడం. రోడ్ల పక్కన అనుకూలం కాని పరిస్థితుల్లో పని చేయాల్సి వస్తోంది. కాబట్టి నాయుడుపేటలో ఆటోనగర్ ఏర్పాటు అత్యవసరం. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి," అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, మెకానిక్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ విజయవంతం కావడంతో పాటు కార్మికుల సమస్యలపై అవగాహన కల్పించడంలో కీలకంగా మారింది. మెకానిక్స్ హక్కుల సాధన, ఆటోనగర్ ఏర్పాటుకై తమ పోరాటం కొనసాగుతుందని అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు.

# కార్మిక లోకానికి మే డే శుభాకాంక్షలు

### - శ్రమశక్తికి వందనం!



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వైస్సార్సీపీ ఇంచార్జ్ వై విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే మే డే సందర్భంగా కార్మిక సోదరులకు కార్మిక దినోత్సవం శుభాకాంక్షలు అనేకమంది కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టి, పని గంటలను 8గంటలకు క్రమబద్ధీకరించడం. కనీస వేతనం, భద్రత మరియు సామాజిక భద్రత వంటి హక్కులపై అవగాహన కల్పించడం. సమాజ అభివృద్ధిలో కార్మికుల పాత్రను గుర్తించి వారికి తగిన గౌరవాన్ని అందించడం.నేటి ఆధునిక కాలంలో కూడా కార్మికుల సంక్షేమం, ఆరోగ్య భీమా, మరియు సురక్షితమైన పని వాతావరణం గురించి చర్చించడానికి ఈ రోజు ఒక వేదికగా నిలుస్తుంది. "కార్మికుల శ్రమయే దేశ సంపద" అనే నినాదంతో ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈ రోజున కార్మికులందరికీ మరియు వారి సంక్షేమం కోసం పాటుపడే ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేయడం మన బాధ్యత.అలాగే పాత్రికేయ మిత్రులకు కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు.

# పదో తరగతి ఫలితాల్లో విడపనకల్లు విద్యార్థిని ప్రభంజనం!

### - మండల టాపర్‌గా విద్య
### - 587 మార్కులతో రికార్డు విజయం



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** విడపనకల్లు జిల్లా పరిషత్ హైస్కూల్ లో చదువు కార్పొరేట్ స్కూల్స్ కి ధీటుగా పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యకు అభినందనలు వెల్లువెత్తాయి. విద్య సాధించిన మార్కులు: 587 / 600 మండల టాపర్‌గా నిలవడం. విద్య సాధించిన ఈ ఘనతపై పాఠశాల ఉపాధ్యాయులు మరియు తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె పట్టుదల, క్రమశిక్షణే ఈ ఫలితానికి కారణమని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తన కుటుంబానికి మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అందరూ ఆకాం క్షించారు. "కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అన్నట్లుగా, విద్య తన కృషితో నేడు అందరికీ ఆదర్శంగా నిలిచింది." మరోసారి విద్యకు మరియు ఆమె తల్లిదండ్రులకు శుభాకాంక్షలు!

## 100శాతం ఉత్తీర్ణత సాధించిన ఏకైక పాఠశాల సరస్వతి విద్యా మందిరం



**పామిడి- సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరంలో 2025-2026 సంవత్సరంలో 10వ తరగతి చదివిన 73 మంది బాల బాలికల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలోనే ఏకైక పాఠశాలగా ప్రతిభను సాధించిన ఏకైక పాఠశాలగా ఘనత పొందింది. మండలంలో 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు,అలాగే 6ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు కలవని, ఈ 12 పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణతను సాధించిన ఏకైక పాఠశాల శ్రీసరస్వతీ విద్యామందిరం మాత్రమేనని ఆ పాఠశాల ప్రధానాచార్యులు సిఆర్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా మాపాఠశాలలో జంగం పూజ ప్రణతి 578 మార్కులు సాధించి ప్రథమ స్థానాన్ని పొందిందగా, అలాగే బోయ బాను 575 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. వీరి ప్రతిభకు అభినందనలు తెలిపారు. ఆ పాఠశాల అభివృద్ధి కమిటీ కార్యవర్గం జిల్లా అధ్యక్షులు కే.రాంప్రసాద్, పాఠశాల అధ్యక్షులు జే. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు విశ్వనాథ, ప్రధాన కార్యదర్శి బివి రత్నమయ్య, సభ్యులు చౌడయ్య, జంగం పెద్దపుల్లారెడ్డి, జోజోడేకుమార్, జోగిపుల్లయ్య ఉపాధ్యాయబృందం తదితరులు పదవ తరగతి యందు ఉత్తీర్ణులైన 73 మంది విద్యార్థులకు అభినందనలు తెలిపి ముందు ముందు చదువులలో మరింత విజయాలను సాధించాలని, వారందరినీ ఘనంగా సత్కరించారు.

## తండ్రి స్మారకార్థం దివ్యాంగుల శిక్షణా కేంద్రానికి ఆర్థిక సాయం


**- ఉత్తమ ఉద్యోగిగా విశేష సేవలు అందించిన ముహ్వా చిన్న సుబ్బరాయుడు చిరస్మరణీయుడు**



**పులివెందుల - సూర్య వాస్తవం :** సహృదయుడు, స్నేహశీలి, కార్యదక్షుడిగా, ఉత్తమ ఉద్యోగిగా, కడప జిల్లాపరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా తన ఉద్యోగ జీవితంలో ప్రజలకు విశేష సేవలందించి, అటుకుటుంబానికి, ఇటు ఉద్యోగ జీవితా నికి వందశాతం న్యాయం చేకూర్చి, అందరి ఆదరాభిమానాలు చూరగొన్న ముహ్వా చిన్న సుబ్బరాయుడు చిరస్మరణీయుడని, ఆయన సేవాతత్పరతను పుణికిపుచ్చుకున్న వారి కుమారుడు ముహ్వా ఓంప్రకాష్ తన తండ్రి వర్ధంతి సందర్భంగా దివ్యాంగుల శిక్షణాకేంద్రానికి చిరుసాయమందించి చేయూతనివ్వడం అభినందనీయమని, ముహ్వా కుటుంబసభ్యుల సేవాస్ఫూర్తి అందరికీ ఆదర్శమని వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు డా.ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని ప్రముఖ పాత్రికేయుడు ఓంప్రకాష్ తండ్రి ముహ్వా చిన్నసుబ్బరాయుడు 20వ వర్ధంతిని పురస్కరించుకొని, స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో దివ్యాంగులు, ముహ్వా కుటుంబ సభ్యులు ఆయన పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల శిక్షణా కేంద్రానికి ఓంప్రకాష్ ఆర్థిక సాయం అందించారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ ముహ్వా ఓంప్రకాష్, టైలరింగ్ సెంటర్ ట్రైనింగ్ టీచర్ మల్లీశ్వరి, శిక్షణార్థులు శివాజీ రాజారెడ్డి, ప్రభాస్, రమణమ్మ, సోనీ, ప్రమీల, నాగలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

**సింహాద్రిపురం- సూర్య వాస్తవం:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని విద్యుత్ శాఖ డీఈఈ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి సింహాద్రిపురం సబ్ స్టేషన్ లో లైన్ మెన్ వేణుగోపాల్ పదవి విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ వేణుగోపాల్ విధినిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ అందరి ఆదరాభిమానాలను పొందారున్నారు. పదవీ విరమణ పొందిన వేణుగోపాల్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే విధి నిర్వహణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం వేణుగోపాల్ దంపతులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ పులివెందుల రూరల్ ఏడిఈ జయ సుధాకర్ రెడ్డి, ఏఈ దినేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జయంతి

**- సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసిన సీపీఎం రాష్ట్ర నాయకులు ఓబుల్**




**డోన్ -సూర్య వాస్తవం:** పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజా నాయకుడు దక్షిణ భారత కమ్యూనిస్టు నిర్మాత పేద బడుగు బలహీన వర్గాలకు వేలాది ఎకరాలు భూములు పంచిన పోరాటయోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు ఓబుల్ తెలియజేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ముందుగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి రాష్ట్ర నాయకులు ఓబుల్ పూలమాల వేయడం జరిగింది అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబుల్ పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లా, విడవలూరు మండలం, అలాగానిపాడు గ్రామంలో వెంకటరామిరెడ్డి/శేషమ్మలకు 1913లో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్ విద్యను నెల్లూరు జిల్లాలోని విద్యను అభ్యసించడం జరిగింది ఇంటర్మీడియట్ విద్యను మద్రాస్ లో చదవడం జరిగిందని వారు తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య ఆరు సంవత్సరాల వయసులోనే తన తండ్రి గారు మరణించడం జరిగిందని పుచ్చలపల్లి సుందరయ్య గారు పుట్టినప్పటి నుంచి తమ జీవితమంతా పోరాటంతోనే జరిగిందని వారన్నారు. స్వతంత్రానికి ముందు 1930లో గాంధీ నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహం కార్యక్రమంలో అగ్ర భాగాన నిలబడి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన సుందరయ్య అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించి తమ సొంత గ్రామంలోని విందు భోజనాలు ఏర్పాటు చేసి కుల మతాలకు అతీతంగా అంటరానితనానికి వ్యతిరేకంగా దళితులకు భూస్వాములకు సమానంగా విందు ఏర్పాటు చేసి అంటరాని తనాన్ని రూపుమాపడానికి ఆనాడే పోరాటాన్ని కొనసాగించిన వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. రైతు సమస్యలపై 1500 గ్రామాలు పాదయాత్ర నిర్వహించి రైతాంగ సమస్యల పరిష్కారానికి ఆల్ ఇండియా కిషన్ సభ రైతు సంఘం ఏర్పాటు చేసి రైతాంగ పోరాటంలో నిలిచిన వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని వారన్నార. కేరళ, త్రిపుర, పశ్చిమబెంగాల్, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ లాంటి దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని విస్తరింపజేసి నిర్మించిన వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఇలాంటి మహనీయుల త్యాగాలు నేటికీ స్మరించుకుంటూ వారు నడిచినటువంటి బాటలోనే పయనిస్తూ బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకై మనమందరం ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎ.చిన్న రహిమాన్ మాణిక్యం శెట్టి, సుబ్బరాయుడు, శివరాం, షమీమ్ బేగం, సిరీనా, వెంకటేశ్వరమ్మ, కుల్లయ్యప్ప,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు

**- రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించడమే మా ప్రథమ ప్రాధాన్యత**
**- తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి**




**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందులలో సాగునీటి వ్యవస్థకు సంబంధించి ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నాము అని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కోమన్నుతల, వెలిదండ్ల పంప్ హౌస్‌లలో ఉన్న మోటార్ల మరమ్మతుల కోసం పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి అడిగిన వెంటనే కడపజిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ 16 లక్షల రూపాయలను మంజూరు చేశారు. ఒక వారం లేదా పది రోజుల్లో ఈ మరమ్మతులు పూర్తి చేసి, సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటాము. అలాగే, రాంనున్నతల పల్లె పంప్ హౌస్‌లో దొంగతనం జరిగిన వస్తువులను మళ్ళీ అమర్చి, దాన్ని కూడా త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. గుణకనపల్లె పంప్ హౌస్ పనులను పర్యవేక్షించాం. అది వ్యక్తిగత కారణాల వల్ల గతంలో నిలిచిపోయింది, కానీ ఇప్పుడు ఆ పనులను పూర్తి చేసి డిపార్ట్‌మెంట్‌కు అప్పగించనున్నాం. ముబ్బుచింతలపల్లిలో గతంలో తరలించిన మోటార్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి, 15 రోజుల్లో నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం. రాచకుంటపల్లిలో ఇప్పటికే ఒక మోటార్ ఏర్పాటు చేశాం, మిగిలిన ఆరు మోటార్లను కూడా మరమ్మతులకు పంపించాం. పిబిసి కాలువలో గతంలో జరిగిన మట్టి పనుల లోపం వల్ల నీటి ప్రవాహం ఆలస్యం అవుతోంది. దాన్ని సరిదిద్ది అలవలపాడు, వేంపల్లి, మొగమేరు ద్వారా రామిరెడ్డిపల్లి రైతులకు నీరు అందించడానికి ప్రయత్నిస్తున్నాం. ఎంపీ రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నారు కానీ, రైతు సమస్యల పరిష్కారానికి గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదు. ప్రస్తుతం వేసవి కాలం కావడం, అరటిసాగు పెరగడం వల్ల నీటి డిమాండ్ పెరిగింది. మేము ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరించి రైతులకు అండగా ఉంటాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యాడ్ చైర్మన్ అమర్‌నాథ్ యాదవ్, ఓబులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## అకాల వర్షంతో అరటి రైతులకు లక్షల్లో నష్టం

**- రెండు ఎకరాల్లో పంట నాశనం - రూ.2లక్షల మేర నష్టపోయానని రైతు ముని యాదవ్ ఆవేదన - ఉద్యానవన శాఖ అసిస్టెంట్ యువ తేజ క్షేత్రస్థాయిలో పరిశీలన**

**లింగాల – సూర్య వాస్తవం:** లింగాల మండల పరిధిలోని రామట్లపల్లి, చిన్నకుడాల, గుణకనపల్లి, మురారి చింతలతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు వందల ఎకరాల్లో అరటి పంట నేలమట్టమైంది. ఉద్యానవన శాఖ అసిస్టెంట్ యువతేజ శుక్రవారం నేలమట్టమైన అరటి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతు ముని యాదవ్, మాట్లాడుతూ తాను రెండు ఎకరాల్లో అరటి సాగు చేయగా, గురువారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, అకాల వర్షానికి సుమారు రూ. 2లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. తనలాగే మండలంలో చాలామంది రైతులు సాగు చేసిన అరటి తోటలు పూర్తిగా నేలకు ఒరిగాయని ఆయన తెలిపారు. కాపు దశలో ఉన్న పంట నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన పంటలకు వెంటనే ప్రాథమిక అంచనాలు తయారు చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించాలని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందే విధంగా అధికారులు కృషి చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## పత్తి పంటల పరిశీలన

**- రసం పీల్చు పురుగు నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన**



**వేముల – సూర్య వాస్తవం :** మండల వ్యవసాయాధికారి జిపి ఓబులేసు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గొల్లల గూడూరు, చాగలేరు గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చు పురుగులు, మెగ్నీషియం దాతు లోపం వల్ల నష్టం కలుగజేస్తున్నట్లు గమనించామని చెప్పారు. రసం పీల్చు పురుగుల నివారణ చర్యల గురించి జిపి ఓబులేసు రైతులకు వివరించారు. పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా గులాబీ రంగు పురుగు నివారణకు గొల్లల గూడూరు,చాగలేరు గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి 10 లింగాకర్శక బుట్టలు, 10,000 పీపీఎం గాడత వేప నూనె, 400 మి.లీప్రోఫినోపాస్, 400 మి.లీ. క్లోరో పైరిఫాస్, 500 మి.లీ. క్లొరాత్ర నిలిప్రాల్, 60 మి.లీ. లాండ సహాలాత్రిన్ వాడమని తెలిపారు. అనంతరం ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలు పత్తి పంటలో ఎలా పెట్టుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించడం వల్ల ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.